ప్రజాశక్తి

గురువారం 4 సెప్టెంబర్ 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు




కుడికాల్వకు గండం

- చంద్రవంక వాగు బ్రిడ్జీలో చెట్లు.. దెబ్బతింటున్నా జాగ్రత్తలు తీసుకోవడంలో మీనమేషాలు
- ప్రమాదం జరిగితే 11 లక్షల ఎకరాల పొలాలు, వేలాది గ్రామాలకు ఇక్కట్లే







ప్రజాశక్తి - మాచర్ల

నాగార్జున సాగర్ కుడికాల్వ విషయంలో తెలిసి తెలిసి ప్రమాదాన్ని కొనితెచ్చే తీరు, గండం పొంచి ఉన్నా యంత్రాగం నిమ్మకు నీరితెత్తినట్టు ఉండడం విమర్శలపాలవుతోంది. కాల్వ గట్లకు గండిపడితే ఒకటి రెండ్రోజుల్లో గండి పూడ్చి సమస్యను పరిష్కరించవచ్చు. అదే కుడికాల్వ ప్రవహించే బ్రిడ్జికి ప్రమాదం జరిగితే లక్షల ఎకరాలకు సాగు నీరు అందక పంటలు ఎండిపోయే అవకాశముంది. సాగునీటి సరఫరాలో నాగార్జున సాగర్ కుడి కాల్వ (జవహర్ కాల్వ) ప్రధానమైంది. ఇది డ్యామ్ కుడివైపు నుంచి బయలుదేరి గరిష్టంగా 311.5 క్యూమెక్స్ (సెకనుకు ఒక క్యూబిక్ మీటర్) సామర్థ్యంతో 203 కిలోమీటర్లు (126 మైళ్లు) పొడవున ప్రవహిస్తుంది. కాల్వ కింద ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 6,68,230 ఎకరాలు, ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 4,43,180 ఎకరాలు మొత్తం 11,11,410 ఎకరాలు ఆయకట్టు ఉంది. వందల గ్రామాల తాగునీటి అవసరాలు తీరుస్తుంది. ఎంతో ప్రాధాన్యమున్న కుడి కాల్వకు నీరు నిలిస్తే లక్షల ఎకరాలు సాగు, గ్రామాలు సైతం ఇబ్బందులో పడతాయి. కుడికాల్వ ద్వారా

▶ 2లో

గుంటూరు కొత్త జెసిగా అశుతోష్ శ్రీవాస్తవ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా అశుతోష్ శ్రీవాస్తవ నియమితులయ్యారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న 2021 బ్యాచ్‌కు చెందిన శ్రీవాస్తవను జెసిగా నియమించి ప్రస్తుత జెసి భార్గవ తేజను బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ బుధవారం జారీ చేసిన ఉత్తర్వులు రాత్రి 11 గంటలకు జిల్లా అధికారులకు అందాయి. గతేడాది అక్టోబరులో జెసిగా నియమితులైన భార్గవతేజ ఏడాది కాకుండానే ఆకస్మికంగా బదిలీ అయ్యారు. కలెక్టర్ నాగలక్ష్మి బదిలీ అవుతారని కొంతకాలంగా ప్రచారమైనా ఊహించని విధంగా జెసి బదిలీ చర్చనీయాంశమైంది.

అసాధారణ మరణాలపై పరిశీలన

- తురకపాలెంలో వైద్య బృందం పర్యటన
- మెలైడియోసిస్ గురించి ఇప్పుడే చెప్పలేం : డిఎంఇ



ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో రెండు నెలలుగా నమోదవుతున్న అసాధారణ మరణాలపై రాష్ట్ర వైద్య బృందం డీఎంఈ డాక్టర్ రఘునందన్ నేతృత్వంలో బుధవారం పరిశీలించింది. ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరం, నిర్ధారణ కాని ఇన్‌ఫెక్షన్ వ్యాధులతో ఇప్పటి వరకూ 30 మంది మృతి చెందారని బృందానికి జిల్లా అధికారులు తెలిపారు. మృతికి కారణాలపై గుంటూరు మెడికల్ కాలేజీ ఆరు విభాగాల నిపుణులు పరిశీలించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి, డిఎంఅండ్ హెచ్‌ఒ డాక్టర్ విజయలక్ష్మి, స్థానిక వైద్య నిపుణులు డాక్టర్ కళ్యాణ్ ఇతర అధికారులు పరిశీలనలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డీఎంఈ డాక్టర్ రఘునందన్ మీడియాతో మాట్లాడుతూ మరణాలు సంభవిస్తున్న ప్రాంతంలో అపరిశుభ్ర వాతావరణాన్ని గుర్తించామని, మురికి నీరు, మట్టి, పశు విసర్జిత వ్యర్థాల కలయిక వల్ల ఈ పరిస్థితి వచ్చినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చామని చెప్పారు. గ్రామంలోని 2500 మంది జనాభాలో 1200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని, 800 కుటుంబాలకు గాను 400 ఇళ్లల్లో వైద్య సిబ్బంది పరీక్షలు చేశారని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో 2, మేలో 3, జూన్‌లో 2, జులైలో 10, ఆగస్టులో 10, ఈ నెలలో

▶ 2లో



ప్రజాప్రతినిధుల గైర్హాజరుతో ఖాళీగా ఉన్న కుర్చీలు

విజిలెన్సు కమిటీ భేటీకి ప్రజా ప్రతినిధుల డుమ్మా

రేషన్ అక్రమాల్లో పెద్ద చేపలను పట్టాలని : జెసి ఆదేశం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా స్థాయి విజిలెన్సు కమిటీ తొలి సమావేశానికి ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మినహా మిగతా ప్రజాప్రతినిధులంతా గైర్హాజరయ్యారు. కేంద్ర ఆహార భద్రతా చట్టం అమలు సమీక్షలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వినియోగదారులకు అందించాల్సిన సేవలు, రేషన్ సరఫరా, మధ్యాహ్న భోజనం, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ, అంగన్ వాడీ కేంద్రాలు, సంక్షేమ వసతి గృహాలకు అందించాల్సిన ఆహార పదార్థాలకు సంబంధించిన అంశాలను చర్చించి లోపాలను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి జిల్లాలోని ప్రజా ప్రతినిధులతో కలిపి మొత్తం 47 మంది హాజరు కావాల్సి ఉండగా కేవలం 12 మందే హాజరయ్యారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ మాట్లాడుతూ రేషన్ అక్రమ రవాణాపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నా పౌరసరఫరాల శాఖ అధికారులు కేవలం సైకిళ్లు, లూనాలు, ఆటోల్లో వెళ్లే బియ్యం తీసుకువెళ్లే వారినీ పట్టుకుంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్కువ మొత్తంలోనే 6ఏ కేసులు నమోదు అవుతున్నాయన్నారు. డీలర్లు ఒక్క రోజే 300 కార్డులకు రేషన్ ఇవ్వడాన్ని గుర్తించామని, త్వరలో చర్యలు ఉంటాయని చెప్పారు. ఈ-పోస్ మిషన్లను ఒక్కచోట నుంచి మరో చోటకు తీసుకువెళ్లి రేషన్ ఇవ్వొద్దన్నారు.

ఎమ్మెల్సీ ఏసురత్నం మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖలో

▶ 2లో



సాగర్ గేట్లు మూసివేత

ప్రజాశక్తి - విజయపురిసౌత్

శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి వరద ప్రవాహం తగ్గడంతో బుధవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను మూసివేశారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 586.10 అడుగుల వద్ద ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 312.5050 టీఎంసీలు కాగా ప్రస్తుతం 300.8385 టీఎంసీలుంది. ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా 34,307 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, కుడి కాల్వ ద్వారా 10 వేల క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 5,654 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 2400 క్యూసెక్కులు, లోలెవెల్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, మొత్తంగా ప్రాజెక్టు నుండి అవుట్‌ఫ్లోగా 52,661 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్‌కు ఇన్‌ఫ్లోగా 52,661 క్యూసెక్కులు వస్తోంది. సాగర్ కుడి, ఎడమ, ప్రధాన జల విద్యుత్ కేంద్రాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.



యూరియాపై ప్రతిరోజూ బులిటెన్

- పల్నాడు జిల్లాలో కొరత లేదు
- అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్టు కింద కేసు
- తనిఖీలు, రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు
- పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యూరియాపై అసత్యాలు ప్రచారం చేయొద్దని, జిల్లాలో యూరియా కొరత లేదని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు చెప్పారు. ఇకమీదట యూరియా నిల్వలపై ప్రతిరోజూ బులెటిన్ విడుదల చేసి అనుమానాలకు తావులేకుండా చూస్తామన్నారు. ఈ అంశమై నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో బుధవారం ఆయన జెసి సూరజ్ ధనుంజయ్ గనోరె, ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిపి మీడియాతో మాట్లాడారు. ఖరీఫ్ సాగుకు 34,556 మెట్రిక్ టన్నుల యూరియా అవసరంకాగా ఇప్పటి వరకూ ప్రభుత్వం నుండి 36,615 మెట్రిక్ టన్నులు అందిందని, రైతులకు 26,616 మెట్రిక్ టన్నులు సరఫరా చేయగా 7,442 మెట్రిక్ టన్నుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అనవసర

▶ 2లో



పల్నాడు జిల్లా ఫైనాన్స్ మేనేజర్ హీరాలాల్ నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రూ.35 కోట్ల ఉపాధి హామీ కూలి బకాయిలివ్వండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉపాధి హామీ పనులు చేసిన వారికి నెలలు గడుస్తున్నా డబ్బులివ్వకపోతే ఎలాగని కూలీలు ఆవేదనకు గురయ్యారు. బకాయిలున్న రూ.35 కోట్లు విడుదల చేయాలని కోరుతూ నరసరావుపేట పట్టణం రామిరెడ్డిపేటలోని డ్వామా పీడీ కార్యాలయం ఎదుట బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. జిల్లా ఫైనాన్స్ మేనేజర్ హీరాలాల్ నాయక్‌కు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం కూలీకు డబ్బులివ్వకుండా ఇతర పథకాలకు దారిమళ్లించినట్లు నాడు ప్రతిపక్షంలో ఉండి విమర్శించిన ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు ఇప్పుడేం చేస్తున్నారని

▶ 2లో

గుంటూరు, పల్నాడు ఉపాధ్యాయులకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

ప్రజాశక్తి-గుంటూరు : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు గుంటూరు, పల్నాడు జిల్లాలో పలువురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. గుంటూరులోని శారదానికేతనం స్కూల్ గణితం స్కూల్ అసిస్టెంట్ పి.సునీతారజిని, గుంటూరులోని రవీంద్ర నగర్ పిఎంసి హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ స్కూల్ అసిస్టెంట్ జి.సుశీలామాదవి, తెనాలి, చెలిపాలెం ఎంపిపి మోడల్ స్కూల్ ఎస్‌జిటి ఉపాధ్యాయులు డాక్టర్ అవ్వారి భద్రావతి ఎంపికయ్యారు. పల్నాడు జిల్లా నుండి నకిరేకల్లు జెడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయురాలు బి.శివకుమారి, ఎస్‌బి పురం జెడ్పీహైస్కూల్ గ్రేడ్ 2 హెచ్ఎం మోటా పార్వతి, నూజెండ్ల మండలం, కనపర్రు బిపిఆర్ ఎంపిపి స్కూల్ ఎస్‌జిటి ఉపాధ్యాయురాలు వై.రాజ్యలక్ష్మి ఎంపికయ్యారు.

ఇద్దరు సచివాలయ సెక్రెటరీల సస్పెన్షన్

ప్రజాశక్తి-గుంటూరు : విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నారంటూ గుంటూరు నగరంలోని 127 వార్డు సచివాలయ ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రెటరీ ఆర్.రామబిల్వికాదేవి, వెల్ఫేర్ సెక్రెటరీ వి.రవికుమార్‌ను విధుల నుండి సస్పెండ్ చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సదరం సర్టిఫికెట్లను ప్రస్తుత ప్రభుత్వం సరఫరా చేసిన స్టేషనరీతో కాకుండా గత ప్రభుత్వంలో అందించిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఫొటోతో ఉన్న స్టేషనరీపై ప్రింట్‌చేసి అందించినందుకుగాను వారిని సస్పెండ్ చేసినట్లు చెప్పారు. అలాగే నోడల్ అధికారి కె.సాంబశివరావు, అడ్మిన్ కార్యదర్శి ఎ.నాగమణికి షోకాజు నోటీసులు జారీ చేశామన్నారు. కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో 127 వార్డ్ సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులతో మాట్లాడారు. ఇప్పటికే వార్డుసచివాలయ పాత సర్టిఫికెట్లను జిఎంసికి సరెండర్ చేయాలని, నేమ్‌బోర్డులు మార్చాలని ఆదేశాలు ఇచ్చామని, కానీ కొందరు కార్యదర్శులు నిర్లక్ష్యంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తంచేసి, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు.

రహదారులు పార్కింగ్ కోసం కాదు : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు : నగరంలో ప్రధాన రహదారులు వ్యాపారసంస్థల పార్కింగ్ కోసం కాదని, ప్రజల వాహనాలు రాకపోకలకు అని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం కమిషనర్ పట్టాభిపురం మెయిన్‌రోడ్, జేకేసి కాలేజిరోడ్, ఇన్నర్ రింగ్‌రోడ్ ప్రాంతాల్లో పర్యటించి, రోడ్ల ఆక్రమణలను, అభివద్ధి పనులను పరిశీలించారు. హోటల్స్, షాపింగ్‌మాల్స్ వంటి సంస్థలు తమ భవన ప్రాంతాల్లోనే పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని, అలా కాకుండా ట్రాఫిక్‌కి అడ్డుగా రోడ్లను ఆక్రమించి వాహనాలు పార్కింగ్ చేస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ప్రణాళిక విభాగ ఆక్రమణ ఆక్రమణ నిర్మూలన దళం రోడ్ల ఆక్రమణల తొలగింపుపై మరింత చొరవగా ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. శంకర్ విలాస్ వంతెన పనుల వలన నగర ప్రజలు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతుంటే రోడ్ల ఆక్రమణ చేయడం సరికాదన్నారు. జేకేసి కాలేజి రోడ్‌లో పైప్ లైన్ లీకు వర్క్‌ని పరిశీలించారు. పర్యటనలో కార్పొరేటర్ వి.శ్రీరాం ప్రసాద, డిఈఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.

5,700 మంది మహిళలను వ్యాపారస్తుల్ని చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు : జిల్లాలో మహిళల జీవనోపాధుల మెరుగుదలకు, వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చేయటానికి డీఆర్డీఏ-వెలుగు శాఖను సమన్వయం చేసుకుంటూ స్వయంసహాయక సంఘాలకు బ్యాంకర్లు సక్రమంగా రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్డీఏ-వెలుగు ఆధ్వర్యంలో బ్యాంకర్లుకు, ఎ.పి.యం.లు, సి.సి.లకు నిర్వహించిన వర్క్‌షాపులో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 20 వేల సంఘాలలో 2లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉంటూ ప్రతి సంవత్సరం సుమారు రూ.850 కోట్లు రుణాలు పొందుతూ నూటికి 99 శాతం రుణాలు చెల్లిస్తూ ఉండడం విశేషమన్నారు. జిల్లాలో 5,700 మంది మహిళలను వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చేయాలని లక్ష్యం నిర్దేశించిందన్నారు. దీని కోసం ప్రతి సీసీ 100 ధరఖాస్తులను చేయించాలన్నారు. డీఆర్డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి మాట్లాడుతూ 74,966 మంది స్వయం సహాయక సంఘ సభ్యులు రూ.876.41 కోట్లు రుణాలు కుటుంబ పెట్టుబడి ప్రణాళికలను తయారు చేశామన్నారు.

104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతి



డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న 104 మొబైల్ మెడికల్ యూనిట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం డిఎంహెచ్ఒ డాక్టర్ కె.విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం నుండి ఉద్యోగులకు తగ్గించిన వేతనాలతో సహా చెల్లించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, గత యాజమాన్యమైన అరబిందో నుంచి రావాల్సిన అన్ని బకాయిలను ఉద్యోగులకు చెల్లించేలా ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని అన్నారు. 104లో స్లాబ్ పద్ధతి అమలు జరపాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు అమలయ్యే లీవులు, ఎర్న్‌లీవులు, పబ్లిక్ హాలిడేలు, గుర్తింపుకార్డులు, పేస్లిప్లు ఇవ్వాలన్నారు. వాహనాలకు సరిపడినటువంటి సిబ్బందిని నియమించాలని, అవసరమైన బఫర్‌జోన్ ఉద్యోగులను నియమించాలన్నారు. వాహనాలు ఏళ్ల తరబడి రిపేర్ చేయక ఇబ్బంది పడుతున్నారని అన్ని రకాల రిపేర్లను చేయించాలన్నారు. రూ.10 లక్షల బీమా సౌకర్యాన్ని ప్రతిఒక్క ఉద్యోగికి కల్పించాలన్నారు. ఈపీఎఫ్ ఈఎస్ఐ పూర్తిస్థాయిలో అవ్వడం జరిగే విధంగా, ఈఎస్ఐ దాటిన వారికి హెల్త్ కార్డులిచ్చేలా చర్యలు తీసుకోవాలని జరిగే ఆందోళనలో ప్రతి ఒక్క ఉద్యోగి పాల్గనాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, అధ్యక్షులు గోరంట్ల సురేష్‌కుమార్, కార్యదర్శి ఆలూరి శ్రీహర్ష, కోశాధికారి ఐ.నాగులు, బి.బాలకఅష్ణ, విజయ్‌కుమార్, ఏడుకొండలు, సురేష్, సాయిరాం పాల్గొన్నారు.



లోకేష్ ఆరోపణలపై వైసిపి ధ్వజం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : వైఎస్ జగన్‌పై మంత్రి నారా లోకేష్ అవాస్తవమైన ఆరోపణలు చేస్తున్నారని వైసిపి జిల్లా నాయకులు విమర్శించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, జిల్లా సమన్వయకర్త పోతిన మహేష్, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, వివిధ నియోజకవర్గాల సమన్వయకర్తలు బుధవారం సాయంత్రం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఈనెల తొమ్మిదో తేదీన రైతుల తరపున పోరాటం చేస్తామన్నారు. రైతులకు కనీసం యూరియా కూడా అందించలేకపోతున్నారని విమర్శించారు. అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో రైతుల తరపున వినతి పత్రాలు సమర్పిస్తామని తెలిపారు. లోకేష్ సంస్కార హీనంగా మాట్లాడటం మానుకోవాలన్నారు. లోకేష్ బాబాయి రామ్మూర్తి నాయుడ్ని సంకెళ్లతో కట్టేసిన విషయం, జూనియర్ ఎన్‌టిఆర్‌ను, ఆయన తల్లిని టిడిపి నాయకుల చేత దూషించిన విషయం ప్రజలకు గుర్తుందన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత, వరదలు కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం రైతులకు అందజేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

నిరుద్యోగులకు ఉచితంగా నైపుణ్య శిక్షణ : ఎమ్మెల్సీ రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రెండున్నర లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాయని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్టు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు, మాజీ ఎమ్మెల్సీలు అశోక్ బాబు, ఎ.ఎస్.రామకృష్ణతో కలిసి బుధవారం



ఆయన తన క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. గుంటూరు లక్ష్మిపురంలోని ఎన్.ఆర్.ఐ ప్రాంగణంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు మాట్లాడుతూ అర్హత పరీక్ష నిర్వహించి మార్కుల ఆధారంగా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇంటర్ అర్హత, డిగ్రీ అర్హత ఉన్న వారికి వేర్వేరుగా శిక్షణ ఇస్తామన్నారు. ఆరు నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వారికి సంబంధించిన వారికి శిక్షణ ఉంటుందన్నారు. త్వరలో విజయవాడలో కూడా ప్రారంభించే ఆలోచన ఉందన్నారు. డీఎస్సీ, పోలీస్, డిఫెన్స్ ఉద్యోగాల పైనే ఎక్కువగా ఆధారపడుతున్నారని ఇంకా కేంద్ర ప్రభుత్వంలో మిగతా శాఖల్లో చాలా ఉద్యోగాలు ఉన్నాయన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కె.బుచ్చిరాం ప్రసాద్ పాల్గొన్నారు.

కుడికాల్వకు గండం

(మొదటి పేజీ తరువాయి)

ఉత్పత్తవుతున్న 90 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోతుంది.

మాచర్ల పట్టణ శివారు ప్రాంతం గుండా సాగర్ కుడి కాల్వ ప్రవహిస్తుంది. ఇక్కడే కుడికాల్వకు కీలకమైన బ్రిడ్జి వుంది. ఈ బ్రిడ్జి లేకపోతే 11 లక్షల ఎకరాలకు సాగునీరు అందదు. నాగార్జున సాగర్ డ్యాంకు 15 కిలోమీటర్లు దూరంలో చంద్రవంక వాగుపై నిర్మించిన ఈ బ్రిడ్జి దిగువ నుండి చంద్రవంక వాగు, పై భాగం నుండి నాగార్జున సాగర్ కుడి కాల్వ ప్రవహిస్తున్నాయి. పై భాగంలో కుడికాల్వ 11వేల క్యూసెక్కుల నీటిప్రవాహ సామర్థ్యంతో, కింద భాగంలో చంద్రవంక వాగు 33,750 కూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యంగల బ్రిడ్జి (చంద్రవంక అక్విడెక్టు)ఇది. ఈ బ్రిడ్జికి ఆరు కానాలు వుండగా, బ్రిడ్జి కానాల పై భాగాల్లో (సాగర్ నీరు ప్రవహించే ప్రాంతం) కంపచెట్లు, మర్రి చెట్లు పెరిగాయి. వాటి వేర్లు కూడా బ్రిడ్జికి అల్లుకుపోయాయి. ఇప్పటికే బ్రిడ్జికి పలుచోట్ల నెర్రెలు ఏర్పడి వాటి కుండా కుడికాల్వ నీరు లీకవుతోంది. మర్రి చెట్లు పెరిగి వాటి వేర్లు లోపలకు చొచ్చుకొని పోవటం వల్ల కాంక్రీట్ నిర్మాణం దెబ్బతింటుంది. బ్రిడ్జికి ఇరువైపులా చెట్లు పెద్దగా పెరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. బ్రిడ్జికి ఏమాత్రం ప్రమాదం జరిగినా కాల్వకు నీరు నిలుపుదల చేయాల్సి వస్తుంది. బ్రిడ్జి దెబ్బతింటే దానికి మరమ్మత్తులు చేయాలన్నా, తిరిగి నిర్మించాలన్నా అంత తేలిగ్గా అయ్యేపనికాదు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నా ఫలితం ఉండదు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి చంద్రవంక అడ్విడెక్టుపై పెరిగిన చెట్లను వెంటనే తొలిగించాలని, కుడికాల్వ గట్లపై పెరిగిన చెట్లను తొలగించి, బ్రిడ్జికు ఏర్పడ్డ పగుళ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అసాధారణ మరణాలపై పరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటి వరకు 3 మరణాలు సంభవించినట్లు వివరించారు. ఏడుగురు వేర్వేరు సమయాల్లో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ చనిపోయారన్నారు. ర్రస్తుం ఇద్దరు చికిత్స పొందుతున్నార్నారు. ఇంకా అనారోగ్య లక్షణాలున్న 29 మంది రక్త నమూనాలను పరీక్షలకు పంపించామని, రెండ్రోజుల్లో నివేదిక వస్తుందని చెప్పారు. గ్రామంలోని నీటి, మట్టి నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించామన్నారు. బ్యాక్టీరియా కారణంగా వచ్చే మెలైడియోసిస్ వ్యాధిపై ఆందోళన అవసరం లేదని, ఐవి యాంటీబయోటిక్ చికిత్స ద్వారా రోగులు కోలుకుంటున్నారని చెప్పారు. అనుమానిత లక్షణాలున్నవారు ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సంప్రదించే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వైద్యం చేయడానికి జిజిహెచ్‌లో ప్రత్యేకంగా 10 పడకలను సిద్ధం చేశామన్నారు.

కిడ్నీ పరీక్షలకు మంత్రి ఆదేశం

తురకపాలెంలోని అందరికీ కిడ్నీ పరీక్షలు, షుగర్‌తో పాటు అవసరమైన ఇతర పరీక్షలు చేయాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. వైద్య శిబిరాల్ని కొనసాగించాలని, వ్యక్తిగత శుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు. డీఎంఈ డాక్టర్ రఘునందన్ పరిశీలనలో ఉన్న సందర్భంలో ఆయనకు ఫోన్ చేసి క్షేత్రస్థాయి సమాచారాన్ని తెలుసుకున్నారు.

రూ.35 కోట్ల ఉపాధి హామీ కూలి బకాయిలివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. జూన్ నుండి ఒక్క కూలీకి కూడా వేతనమివ్వలేదన్నారు. కూలి సకాలంలో ఇవ్వకుండా చట్టాన్నే నీరుగారుస్తున్నారని, కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వ్యవసాయానికి పెట్టుబడులు, ఇతర అప్పులు చెల్లించేందుకు డబ్బుల్లేక కూలీలు తీవ్రంగా ఇబ్బందు పడుతున్నారని వివరించారు. ఇప్పటికైనా కూలి డబ్బులివ్వకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. పని ప్రదేశాల్లో ఉపాధి హామీ కూలీలు భోజనం చేయడానికి, సేదదీరడానికి గతంలో ప్రభుత్వం గుడారాలు, టెంట్లు పంపిణీని పునరుద్ధరించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు పనులు ఆలస్యంగా చూపడం సరికాదన్నారు. కార్యక్రమంలో సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రోశయ్య, నాయకులు కె.నాగేశ్వరరావు, ఎస్.లూథర్, బి.బాలకోటయ్య, పి.ఇశ్రాయేలు, కె.బాలకోటయ్య, పి.సురేష్, కె.నాగమ్మ, పి.వజ్రమ్మ, ఏడుకొండలు, పాల్గొన్నారు.

యూరియాపై ప్రతిరోజూ బులిటెన్

(మొదటి పేజీ తరువాయి)

భయాలతో రైతులు అవసరానికి మించి ఎరువులు కొనుగోలు చేయొద్దన్నారు. ఈనెలాఖరుకు రాష్ట్రానికి రానున్న మరో 2 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల యూరియాలో జిల్లా రైతులకు అవసరమైన కేటాయింపులు ఇతర జిల్లాలతో పోలిస్తే అధికంగా ఉంటాయన్నారు. ఎరువుల అక్రమాలను అరికట్టేందుకు వ్యవసాయ శాఖ, రెవెన్యూ, పోలీసు, మార్కెటింగ్ శాఖల సిబ్బందితో సంయుక్తంగా తనిఖీ బృందాన్ని నియమించామని, అక్రమాలపై అవసరమైతే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యూరియా అక్రమ రవాణా అడ్డుకునేందుకు తెలంగాణ సరిహద్దుల్లోని పొందుగల, తంగేడ, నాగార్జున సాగర్ వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. అక్రమార్కుల సమాచారం తెలిస్తే సంబంధిత అధికారులకు తెలపాలని కోరారు. గతేడాదితో పోలిస్తే ఇప్పటి వరకు 10 శాతం అధిక విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయని చెప్పారు. గతేడాది సెప్టెంబరు నాటికి 2,0500 ఎకరాల్లో పంటలేయగా, ఈ ఏడాది 2,42,500 ఎకరాల్లో సాగైనట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మురళి, జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు పాల్గొన్నారు.

విజిలెన్సు కమిటీ భేటికి ప్రజా ప్రతినిధుల డుమ్మా

(మొదటి పేజీ తరువాయి)

విజిలెన్సు విభాగాన్ని పునరుద్ధరించాలన్నారు. కమిటీ సభ్యులు చదలవాడ హరిబాబు, ఎ.వి.డి.శర్మ, ఈమని చంద్రశేఖర్, హేమలత మాట్లాడుతూ రేషన్‌లో కందిపప్పు, పామోలిన్ ఇతరనిత్యావసర వస్తువులు సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. పోర్టబులిటీ పేరుతో ఐదు రోజుల్లోనే స్టాకు అయిపోయిందని బోర్డులు పెడుతున్నారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరాలో ఇబ్బందులను మహిళాశిశు సంక్షేమ అధికారి వివరించారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తెనాలి

గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. రైల్వే ఎస్సై జి వెంకటాద్రి తెలిపిన వివరాల ప్రకారం సుమారు 50ఏళ్ల వయసున్న వ్యక్తి పెదవడ్లపూడి స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి బుధవారం మృతి చెంది పడి ఉన్నాడు. మృతుడు లేత గోధుమ రంగు షర్టు, కాఫీపొడి రంగుప్యాంటు ధరించి ఉన్నాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన తెనాలి జీఆర్పీ పోలీ సులు రైల్లో నుండి జారి పడడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. తుని జేబులో సెల్‌ఫోన్ చార్జర్, తాళం చెవి ఉన్నాయి. మృతదేహాన్ని తెనాలి వైద్యశాల మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు 7207076614 నంబరులో సంప్రదించాలని ఎస్సై కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు


మృతి చెందిన కొలసాని శ్రీనివాసరావు

పాత మద్రాసు రోడ్డు ప్రమాదంలో యాని మేటర్ భర్త కొలసాని శ్రీనివాసరావు దుర్మరణం చెందిన సంఘటన ప్రత్తి పాడు మండలంలోని తిక్కిరెడ్డి పాలెం వద్ద చోటు చేసుకుంది.ఎస్ఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం పెదనందిపాడు మండలం అన్నపర్రు గ్రామానికి చెందిన కొల్లాసని శ్రీనివాసరావు(35) గుంటూరు నుండి అన్నపర్రు లోని తన ఇంటికి వస్తుండగా రాత్రి 7:30 గంట లకు ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డి పాలెం గ్రామ పరిధిలోని మర్రి కోల్డ్‌స్టోరేజ్ వద్దకు పొగాకు చెక్కులు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను గుద్దుకోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. బార్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరహరి తెలిపారు. మృతునికి ఇద్దరు కవల పిల్లలు రెండవ తరగతి చదువుతున్నారు మూడు నెలలుగా భార్య యాని మేటర్‌గా విధులు నిర్వహిస్తోందని స్థానికులు తెలిపారు.


గాయపడిన వ్యక్తి

రైలు నుండి జారిపడిన వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

చెన్నై నుండి అహ్మదాబాద్ వెళ్తున్న నెంబర్ 12 6 5 6 నవజీవన్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ నుండి జారిపడిన వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం జరిగింది సేకరించిన వివరాల ప్రకారం సుమారు 35 సంవత్సరాలు వయసు కలిగిన వ్యక్తి ఫుట్ బోర్డ్ వద్ద ఉండగా అత్యంత వేగంగా వెళుతున్న రైలు బండి కుదుపులకు దుగ్గిరాల స్టేషన్‌కు ఉత్తరం వైపు దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో జారి పడ్డాడు. 108 వాహనంలో అతనిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతను ఛత్తీస్గాడ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా సమాచారం.

నలుగురు మట్కా నిర్వాహకులు అరెస్టు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని నరసరావుపేట ఇంచార్జ్ డిఎస్‌పి కె.హనుమంతరావు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం నరసరావుపేట పట్టణంలో మట్కా ఆడుతున్న పట్టణానికి చెందిన షేక్.మస్తాన్ వలి, గుడిపాటి వెంకటేశ్వర్లు, షేక్. నన్ను బాజి, మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన పరిమి వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని రూ.51 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఎస్‌పి కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పట్టణం లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో నరసరావుపేట 1వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏంజిల్ టాకీస్ సమీపంలో, 2వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీకష్ణ చిత్రాలయ సెంటర్ సమీపంలో జరుగుతున్న మట్కా కేంద్రాలపై దాడులు నిర్వహించామన్నారు. యువత జూదం, బెట్టింగ్, గుట్కా,మట్కాలతో చేతులారా జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉత్తమ పౌరులుగా ఎదిగి పుట్టి పెరిగిన ప్రాంతానికి తల్లిదండ్రులకు పేరు తీసుకు రావాలని సూచించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిఐలు ఎం.విజయచరణ్, ఎం హైమారావు, ఎస్ఐలు అరుణరెడ్డి, అశోక్‌బాబును డిఎస్‌పి అభినందించారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ అంధకారం

ఎన్‌కార్డ్ సమావేశంలో కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మత్తు పదార్థాలతో భవిష్యత్ అంధకారం అవుతుందని, ఆరోగ్యం దెబ్బతింటుదని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్‌పి కె.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నార్కో సమన్వయ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబ సభ్యుల ప్రభావితం, చట్టాలు, శిక్షలు గురించి వివరించాలన్నారు. విద్యా సంస్థల లో ఈగిల్ క్లబ్‌లతో సమావేశాలు, అవగాహన, నివారణకు పాఠశాల స్థాయి నుండి కళాశాల వరకు అన్ని విద్యా సంస్థల లో స్థాపించిన ఈగిల్ క్లబ్ మెంబెర్స్‌తో సమావేశం ఏర్పా టు చేయాలని డిఇఒ ఎల్. చంద్రకళను ఆదేశించారు. వ్యవ సాయ శాఖ, అటవీశాఖ అధికారులు జిల్లాలో గంజాయి పెంపకంపై నివేదిక సమర్పించాలన్నారు. ఎన్‌ఆర్‌ఎక్స్, సింథటిక్ డ్రగ్స్ నిర్మూలనకు తనిఖీలు చేపట్టాలన్నారు. వీలైనన్ని ఎక్కువ అవగాహన కార్యక్రమాల ద్వారా మాదక ద్రవ్యాల వాళ్ళ కలిగే నష్టాలపై చైతన్యం కలిగించాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ కోరారు. బుధ వారం వేద విద్యాసంస్థల విద్యార్థుల కాప్ బహుకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రముఖ వైద్యురాలు ఫణి ప్రశాంతి నర్సింగ్ విద్యార్థులతో వృత్తి ప్రమాణం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. ఎంతో ఓర్పు సహనంతో వృత్తిలో పేదలకు అండగా ఉండాలన్నారు. అమరావతి రాజధాని కావటం వల్ల సత్తెనపల్లి ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. వైద్య రంగంలో ఎన్నో ఉద్యోగ అవకాశాలున్నాయని చెప్పారు. సత్తెనపల్లి ప్రాంతంలో విభిన్న కోర్సులను విద్యార్థులకు చేరువ చేస్తున్న వేద విద్యాసంస్థల నిర్వాహకులను అభినందించారు. జిల్లా ఇంటర్ విద్యా పర్యవేక్షకురాలు నీలావతి దేవి నర్సింగ్ పారా మెడికల్ కోర్సుల్లో ఉత్తీర్ణులకు పట్టా అందచేశారు. రాష్ట్ర స్థాయిలో రెండవస్థానం పొందిన నాగరాణికి కన్నా జ్ఞాపికను అందచేశారు. కళాశాల కరస్పాండంట్ చింతాడ ప్రభావతి, అకాడమిక్ డైరెక్టర్ చింతాడ సూర్య ప్రకాష్, ప్రిన్సిపాల్ సైదానాయక్, కోటేశ్వరరావు, మాలతీ, సింధూష, నాగలక్ష్మి పాల్గొన్నారు.

చిత్రకారునికి సమగ్ర శిక్ష అభియాన్ అభినందన

ప్రజాశక్తి - తెనాలి


ప్రశంసా పత్రం అందుకుంటున్న వెంకట్

వివిధ సామాజిక అంశాలలో చురుగ్గా పాల్గంటున్న పలువురు ఉపాధ్యాయులను సమగ్ర శిక్ష అభియాన్ అభినం దించింది. దానిలో భాగంగా మారీసుపేట ఎన్‌సిఆర్ఎం హైస్కూల్ చిత్రకారుడు బెల్లంకొండ వెంకట్ ను విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్‌పి డి శ్రీనివాసరావు అభినందించారు. ప్రశంసా పత్రం అందించారు. వెంకట్ చిత్రలేఖనం ఉపాధ్యాయుడిగా, ఎన్సిసి అధికారిగా, షార్ట్ ఫిలిమ్స్ లో నటుడిగా సోషల్ మీడియా యాక్టివిస్ట్ గా ఉన్నారు. వివిధ సామాజిక అంశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఎస్ఎస్ఎ అభినందించారని, జిల్లా నుంచి ఎంపికైన ముగ్గురిలో తానొక్కణ్ణని తెలిపారు.

ప్రతి తల్లీ అంబాసిడరే

ఎపి ఈగల్ ఐజి ఆకే రవి కృష్ణ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మాదక ద్రవ్యాల నుండి బిడ్డను కాపాకునే ప్రతి తల్లీ అంబాసిడరే అని ఎపి ఈగల్ ఐజి ఆకే రవి కృష్ణ అన్నారు. కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహనా సదస్సును నిర్వహించారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో రాష్ట్రంలో మాదక ద్రవ్యాలను సమూలంగా నిర్మూలించడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని, మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి భాధ్యత రవికృష్ణ అన్నారు. కెఎల్ ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్ అద్వర్యంలో నిర్వహించిన మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయి ప్రసంగించారు. నేరాలు జరిగాక కేసులు కట్టడం కంటే నేరాలు జరగకుండా నివారించడమే అత్యంత ముఖ్యమని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులనూ ఈగల్ కార్యక్రమాలలో భాగస్వామ్యం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు.ఎంతో పచ్చదనం మధ్య, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న కెఎల్ విశ్వవిద్యాలయంలో చదువుకునే అవకాశం రావడం విద్యార్థుల అదృష్టమన్నారు. ప్రతీ విద్యార్థి తమ వయస్సు గల వారు ఎవరైనా మాదక ద్రవ్యాల బారిన పడిన సందర్భంలో వారికి (ఈగల్) ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూఫ్ ఫర్ లా ఎన్ ఫోర్స్ మెంట్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 గురించి వారికి తెలియజేయాలని కోరారు. తమను ఆశ్రయించిన మాదక ద్రవ్యాల బారిన పడిన బాధితులకు కౌన్సి లింగ్ నిర్వహించి వారిని కాపాడుతామని ఆయన తెలిపారు. మహారాష్ట్రలో ఓ తల్లి తన చిన్నారిని ఒక పులి నుండి కాపాడు కునేందుకు పెద్ద పులితో పోరాడిన ఘటనను ఆయన ఉదాహరణగా విద్యార్థులకు వివరించారు. పిల్లలను తీర్చిదిద్దడంలో తల్లిని మించిన వారు లేరని అన్నారు. గుంటూరు జిల్లా అదనపు ఎస్పి ఎటివి.రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులందరూ మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ఫలితాల గురించి అవగాహన పెంచుకుని ఇతరులకు తెలియజేయాలని కోరారు. వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ తమ వర్శిటీలో ఎటువంటి ర్యాగింగ్ లేకుండా ప్రతీ విద్యార్థి ఎంతో సంతోషంగా, భద్రంగా ఉంటున్నారని తెలియజేయడానికి సంతోషిస్తున్నా మన్నారు. మాదక ద్రవ్యాలను నివారించడంలో తమ విద్యార్థులు అన్ని విధాలుగా ఈగల్ బృందానికి సహాయ, సహకారాలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జిపిఎస్.వర్మ, ప్రోవైస్ చాన్సులర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీధర్, ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య తదితరులు హాజరయ్యారు.

నూటా ఎన్నికలకు నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అధ్యాపక సం ఘం నూతన అసోసియేషన్ ఏర్పాటుకు సంబంధించి నిర్వహిం చే నూట ఎన్నికలకు ఒక ప్యానల్ మాత్రమే నామినేషన్లు దాఖ లు చేసినట్టు ఎన్నికల అధికారి ఆచార్య ఎస్.మురళీ మోహన్ తెలిపారు. ఆచార్య పి బ్రహ్మజీరావు అధ్యక్షుడిగా ఉన్న ప్యానల్ మాత్రమే వారి వారి నామినేషన్ పత్రాలను అందించడం జరిగిందని తెలిపారు అయితే ఈ ప్యానల్ కాకుండా మరే ప్యానల్ కూడా నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్ దాఖలు చేసిన వారిలో ఉపసంహరణకు అవకాశం ఉందని చెప్పారు. అనంతరం ఎన్నికల వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

కలెక్టర్ ఉత్తర్వుతో సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - దుగ్గిరాల : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, హెచ్ఆర్ఏ విషయంలో స్థానిక ఎస్టిఓకు ఉపాధ్యాయ సంఘాల మధ్య వివాదం తహశీల్దార్ చొరవతో సమసింది. స్థానిక తహశీల్దార్ ఐ.సునీత నవంబర్ 15వ తేదీ 1995 లో జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వు పొందడంతో ఉద్యోగ సంఘాలకు సహకరించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతులకు అవసరమైన ఎరువులకు కృత్రిమ కొరత సృష్టించినా అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి ఎం. జగ్గారావు హెచ్చరించారు. బుధవారం నరసరావుపేట పట్టణంలో ఎరువుల దుకాణాలలో, గోదాములలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దుకాణంలో గోదాములలో నిల్వ చేసిన ఎరువుల వివరాలు దుకాణాలు తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. ఇ-పోస్ ద్వారా ఎరువులు విక్రయించాలనీ, రశీదులో రైతు పూర్తి వివరాలు నమోదు చేయాలని అన్నారు. రికార్డులలో నిల్వలకు, భౌతిక నిల్వలకు వ్యత్యాసం ఉంటే అమ్మకాలు నిలిపి వేస్తామన్నారు. ఎరువులను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసినా, నిబంధనలు అతిక్రమిస్తే ఎరువులు చట్టం 1985 ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. తనిఖీలలో సహాయ వ్యవసాయ సంచాలకులు కెవి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి ఐ శాంతి, వ్యవసాయ విస్తరణ అధికారి కె.బ్రహ్మయ్య పాల్గొన్నారు.



గెలుపొందిన ఎడ్ల జతలతో ఎమ్మెల్యేలు రామాంజనేయులు, నసీర్ఆహ్మద్, గల్లా మాధవి

ముగిసిన ఒంగోలు జాతి రాష్ట్రస్థాయి పశు బల ప్రదర్శన

జూనియర్స్ విభాగం విజేత ప్రకాశం జిల్లా
సీనియర్స్ విభాగం విజేత బాపట్ల జిల్లా

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నందమూరి తారక రామారావు మెమోరియల్ కమిటీ రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి బల ప్రదర్శన బుధవారంతో ముగిసింది బుధవారం జరిగిన జూనియర్స్ విభాగంలో మొత్తం పద మూడు జతలకు పోటీలలో మొదటి విజేతగా ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ముప్పల గ్రామానికి చెందిన పుచ్చకాయల శివపార్వతి కల్యాణ్ మెమోరియల్ పుచ్చకాయల శేషాద్రి చౌదరి చెందిన ఎడ్ల జత 3300 అడుగుల దూరం లాగి మొదటి స్థానం కైవసం చేసుకుంది.బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన ఆర్ కే బుల్స్ అత్తోట శిరీష చౌదరి, అత్తోట శివకష్ణ చౌదరి చెందిన ఎడ్ల జత 3000 అడుగులు లాగి రెండవ స్థానంలో నిలి చిం ది.హైదరాబాద్ రంగరెడ్డి జిల్లాకి చెందిన మేక ప్రదీప్ చెందిన ఎడ్ల జత 2940.10 అడుగుల దూరం లాగి మూడవ స్థానంలో నిలించింది.సీనియర్స్ విభాగంలో మొత్తం పది జతలకు పోటీలు నిర్వహించగా బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన ఆర్కేబుల్స్ అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి చెందిన ఎడ్ల జత 4142.02 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచాయి. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ మండలం గ్రామానికి చెందిన ఎస్ ఎస్ ఆర్ సుంకి సుంకిందర్ రెడ్డి ఏ.ఎస్ పి సుంకి సాకేత్ రెడ్డి,సారిక రెడ్డికి చెందిన ఎడ్ల జత 4014.10 అడుగుల దూరం లాగి రెండవ స్థానంలో నిలిచింది. కడప జిల్లా మైదుకూరు టౌన్కి చెందినా కుర్ర వెంకటేష్ యాదవ్కి చెందిన ఎడ్ల జత 3649.10 అడుగుల దూరం లాగి మూడవ స్థానంలో నిలించింది. బల ప్రదర్శనలో గెలుపొందిన ఎడ్లజత యజమానులకు నిర్వహుకులు స్థానిక ఎమ్మెల్యే రామాంజనేయులు, గుంటూరు తూర్పు నియోజక వర్గ ఎమ్మెల్యే నసీర్ ఆహ్మద్ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి చేత బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వహుకులు పమిడి అంజయ్య, కాకాని సురేష్ తెలుగు దేశం పార్టీ ప్రత్తిపాడు మండల కన్వీనర్ గింజుపల్లి వెంకటశివ ప్రసాద్, ఉపాధ్యక్షుడు పెంట రెడిష్త్రష, మార్కెట్ యార్డు డైరెక్టర్ మస్తాన్, సుబ్బారెడ్డి, బాగ్యారావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శాశ్వత భవనం లేక విద్యార్థుల అవస్థలు

అరకొర వసతులతో కష్టంగా మారిన విద్యా బోధన
472 మంది విద్యార్థులకు మూడు మరుగుదొడ్లే!



మధ్యలో ఆగిన భవన నిర్మాణం



హాస్టల్లో తరగతుల నిర్వహణ

ప్రజాశక్తి-ఈపూరు

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ఏపీ మోడల్ స్కూళ్ల వ్యవస్థను ప్రవేశపెట్టాయి. అయితే మండల కేంద్రం ఈపూరులో తాత్కాలిక భవనాలలో పాఠశాలను నిర్వహించడం ద్వారా విద్యా ప్రమాణాలు కుంటుపడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. శాశ్వత భవనం లేకపోవడంతో ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గదులలో కొద్దిరోజులు మోడల్ స్కూల్ విద్యార్థులకు తరగతులు నిర్వహించారు. అనంతరం పక్కనే ఉన్న న్యూప్రైమరీ పాఠశాల భవనం, ఎస్సీ సంక్షేమ గృహంలో తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవడంతో వరండాలోనే విద్యను బోధిస్తూ ఉపాధ్యాయులు కాలం వెళ్లబోస్తున్నారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు 396 మంది, ఇంటర్ విద్యార్థులు 76 మంది ఉన్నారు. వీరంతా మరుగుదొడ్లు లేక నానాఅవస్థలు పడుతున్నారు. వసతి గృహ విద్యార్థులు ఉతికి ఆరేసిన దుస్తుల మధ్యనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంటర్ విద్యార్థులకు ల్యాబ్, కంప్యూటర్, అపారల్, ఎలక్ట్రానిక్స్ లాంటి ఒకేషనల్ విద్యను అందించేందుకు మౌలిక వసతులు లేక ఆ మేరకు లక్ష్యాలు నెరవేరటం లేదు. దశాబ్ద కాలంగా విద్యార్థులు ఆట స్థలం లేక ఆటలకు దూరమయ్యారు. 2013లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు 14 మోడల్ స్కూళ్లు మంజూరయ్యాయి. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఆధునిక, సాంకేతిక హంగులతో 13 పాఠశాలల నిర్మాణాలను పూర్తి చేసి తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రప్రథమంగా ఈపూరులో ఏపీ మోడల్ స్కూల్ భవన నిర్మాణానికి గ్రామ సమీపంలో శ్రీ బోటి మీద ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం ముందర ప్రభుత్వ స్థలంలో అప్పటి డీఈవో ఆంజనేయులు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించగా ఆ భూమి తమదంటూ కొందరు అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం నరసరావుపేట రెవిన్యూ డివిజన్ అధికారి మండలంలో పలు ప్రాంతాలను పరిశీలించి చివరకు వనికుంట కొండబోడుపై ఉన్న ప్రభుత్వ భూమి ఆరుఎకరాలను కేటాయించారు. గత వైసిపి ప్రభుత్వం నాడు- నేడు నిధులు సుమారు రూ. మూడు కోట్లు మంజూరు చేయగా 60 శాతం పనులు జరిగాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో పనులు ముందుకు సాగలేదు. పాఠశాల భవనం పూర్తి కాకుండానే బాలికల హాస్టల్ భవన నిర్మాణానికి సుమారు రూ.2.26 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టడం గమనార్హం. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన అందించాలనే పాఠశాలలను స్థాపించినప్పటికీ బోధనకు సరైన వసతులు లేక విద్యార్థులు నష్టపోతున్నారు. ప్రజా ప్రతినిధులు పాఠశాల భవన పనుల పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



అధ్యక్ష, కార్యదర్శులు శివ దుర్గరావు, తవీర బ్రహ్మం

బడ్జెట్లో చేనేతలకు అన్యాయం

పల్నాడు జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-సత్తెనపల్లి

చేనేతకు బడ్జెట్లో రూపాయి కూడా కేటాయించకుండా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేశాయని ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక పణిదం చేనేత సహకార సంఘం బిల్డింగ్ ఆవరణలో జరిగిన చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా 3వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహాసభకు పల్నాడు జిల్లా అధ్య క్షులు కట్టా శివ దుర్గారావు అధ్యక్షత వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పవర్లూమ్స్, జెట్లూమ్స్లను ప్రోత్సహిస్తూ చేనేతరంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా చేనేత జెండాను చేనేత జాతీయ అవార్డు గ్రహీత కర్నాటి మురళి, సామాజిక సేవా కార్యకర్త గంజి వీరాస్వామి, పణిదం చేనేత సొసైటీ కార్మికురాలు మంచి మల్లేశ్వరి ఆవిష్కరించారు. ఈ మహాసభలో పదిమందితో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీకి అధ్యక్ష, కార్యదర్శులుగా కట్టా శివ దుర్గరావు, అనుముల వీర బ్రహ్మంను కమిటీ ఎన్నుకోవడం జరిగింది. కమిటీ సభ్యులుగా బిట్రా పానకాలు, పంతంగి ప్రభాకర్, గడ్డం సుసులోవ్, గనికపూడి ఏసురత్నం, వలపర్ల దిబ్బయ్య, మోపపర్తిబాబు రాజు, మల్లాల గురవయ్య, సాముల నాగలక్ష్మిని ఎన్నుకున్నారు.



మహాసభలో ఎన్నికైన నూతన కమిటీ

ఆంధ్రా జాలర్లపై తెలంగాణ వారి దాడి

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని సత్రశాలలో టైల్పాండ్ విద్యుత్ ప్రాజెక్ట్ రాళ్లగుట్ట వద్ద చేపలు పట్టడానికి వచ్చిన ఆంధ్ర జాలర్లపై తెలంగాణకు చెందిన జాలర్లు దాడి చేసి దుర్భాషలాడిన ఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. విజయపురిసౌత్కు చెందిన ఎర్రిపల్లి వెంక టేశ్వర్లు, తాతీలు, చౌడుపల్లి గంగరాజు, మైలపల్లి తాతారావు, ఎర్రిపల్లి చిట్టివలలు వేసి చేపలుపడు తున్న సమయంలో ఆవలి ఒడ్డున ఉన్న అడవిదేవులపల్లికి చెం దిన సొరడ దానయ్య, మల్లికార్జున, చినదానయ్య, వాసుపల్లి సురేష్ నేతత్వంలో పలువురు నది దగ్గరకు చేరుకొని చేపలు పట్టే హక్కు లేదని వాదనకు దిగారు. మాటమాట పెరగడంతో తెలంగాణకు చెందిన వారు 15 మంది వ్యక్తులు విచక్షణ రహి తంగా ఆంధ్ర జాలర్లపై దాడి చేశారు. ఇక్కడ మీరు చేపలు పట్టడానికి వీల్లేదు అంటూ మరోసారి వస్తే వేరే విధంగా ఉం టుందంటూ చిందులు వేశారు వలలను నదిలో వేయడానికి ప్రయత్నించగా ఆంధ్ర జాలర్లు అడ్డుకున్నారు. స్థానికస్టేషన్లో బాధితులు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ అరుణ్ బాబు దృష్టికి వెళ్లడంతో ఆర్డీవో మురళి కృష్ణ తహశీల్దార్ మేరీ కనకంతో ఫోన్లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మత్స్యకార సంఘ నేత గంగరాజు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు నగదు రహిత చికిత్స

పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ 1.50 లక్షల వరకూ ఉచిత వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య అథారిటీ వద్ద నమోదైన ఆసుపత్రులలో ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు జాతీయ ఆరోగ్య అథారిటీలో నమోదు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలు నిరోధించడంలో పోలీసు, రవాణా, ఆర్ అండ్ బి వంటి శాఖలు కృషి చేయాలన్నారు. ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యల వల్ల జాతీయ హైవేలు, రాష్ట్ర హైవేలపై రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుదల పట్టిందని ఎస్.పి కె.శ్రీనివాసరావు వివరించారు. సమావేశంలో ఆర్ అండ్ ఇఇ గీతా రాణి డిఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి, ఆర్డీఓ కె.మధులత, ఆర్టీసీ ఆర్ఎం అజితకుమారి, డిఇఓ ఎల్ చంద్రకళ, జిల్లా రవాణా శాఖ అధికారి సంజీవ్కుమార్, జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్,ఎన్.హెచ్ఐ అధికారులు, నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎన్జిఓ నుండి రోడ్ కమిటీ సభ్యులు, రోడ్డు సేఫ్టీ ఎన్జీవో ప్రెసిడెంట్ ఆర్.కనకదుర్గ పద్మజ పాల్గొన్నారు.



సంగం డెయిరీ వద్ద విద్యార్థులు

సంగం డెయిరీ సందర్శనకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పరిశ్రమల సందర్శన విద్యార్థుల అభివృద్ధికి అన్ని విధాలా దోహదపడతాయని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు అన్నారు. నరసరావుపేట పట్టణం చిలకలూరిపేట రోడ్డులోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల (అటానమస్) 60 మంది విద్యార్థుల బృందం గుంటూరు జిల్లా వడ్లమూడి పరిధిలోని సంగం డెయిరీని బుధవారం సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్శనలో భాగంగా పరిశ్రమలో అధునాతన యంత్ర పరికరాల పనితీరు, తయారు చేసే ఉత్పత్తులు, నిల్వ చేసే పద్ధతు లు గురించి పరిశ్రమ అధికారులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల ప్రయోజనం దృష్ట్యా ఈ సందర్శన ఏర్పాటు చేశా మన్నారు. అకాడమిక్ డైరెక్టర్ డి యోగేశ్వరరావు,

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

న్యూటన్స్ కాలేజీలో రాష్ట్ర స్థాయి జూనియర్ క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - మాచర్ల

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని న్యూటన్స్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ల సెక్రటరీ జున్నా శ్రీనివాసరెడ్డి అన్నారు. మాచర్ల పట్టణ సమీపంలోని న్యూటన్స్ ఆఫ్ ఇనిస్టిట్యూట్లలో బుధవారం రాష్ట్ర స్థాయి జూనియర్ క్రికెట్ పోటీలను కళాశాల సెక్రటరీ జున్నా శ్రీనివారెడ్డి రిబ్బన్కట్ చేసి ప్రారంభించారు. జున్నా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చినపుడే జీవితంలో మరింత ఉన్నత స్థితికి చేరుకోగలుగుతారని తెలిపారు. క్రీడల ప్రాముఖ్యత, శారీరక ఆరోగ్యం, క్రమశిక్షణ గురించి వివరించారు. విద్యమనిషికి జ్ఞానాన్ని ఇచ్చి ఎలా మెరుగు పరుస్తుందో క్రీడలూ మన జీవితానికి ఎన్నో పాఠాలు నేర్పిస్తాయన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జున్నా శ్రీనివాసరెడ్డి

మొదటిరోజు పోటీల్లో 10 జట్లు పాల్గొన్నాయి. మొత్తం 40 జట్లు తలపడుతున్నాయి. విజేతలకు రూ.25, 20, 15 వేలు చొప్పున నగదు బహుమతులను ఇవ్వనున్నారు. కళాశాల డైరక్టర్ జున్నాపద్మజ, ప్రిన్సిపాల్ జగదీశ్వర్రెడ్డి, కళాశాల అధ్యాపకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకులు మారినా.. వీడని గ్రహణం..!

నులకపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిలిచిపోయిన అభివృద్ధి పనులు

ప్రజాశక్తి- తాడేపల్లి

పాలకులు మారితే..! అభివృద్ధి పనులకు గ్రహణం తప్పదా...! అనే ప్రశ్న వేసుకుంటే అవుననే సమాధానం వస్తుంది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ తాడేపల్లి పట్టణంలోని నులకపేట జిల్లా పరిషత్ హై స్కూల్. గత ప్రభుత్వంలో విప్లవాత్మకంగా ప్రవేశపెట్టామని చెప్పుకొని, నాడు నేడు పథకం పేరుతో, 2022, జూన్ నెల, 25వ తేదీ న అప్పటి ఎంఎల్‌ఎ రామకృష్ణారెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పేరుతో శిలాఫలకం వేశారు. పనులు పూర్తిగాక శిలాఫలకం నేటికీ వెక్కిరిస్తూ అలాగే దర్శనమిస్తోంది. పాఠశాలకు అవసరమైన అదనపు గదులు, చుట్టూ ప్రహరీ గోడ, మరుగుదొడ్లు, ఫ్లోరింగు, మంచినీటి ఏర్పాటు తదితర పది పనుల కోసం రూ.97 లక్షల, 98000 ప్రభుత్వం శాంక్షన్ చేసింది. కొత్త తరగతి గదులు నిర్మించడానికి, ఉన్న తరగతి గదులు కూల్చివేశారు. మొదట విడతగా రూ 24 లక్షలు విడుదల చేశారు. ప్రహరీ గోడ తో పాటు కొన్ని చిన్నపాటి అభివఅద్ధి పనులు పూర్తి చేశారు. విద్యార్థులకు అవసరమైన అదనపు తరగతి గదులు మాత్రం ఇంతవరకు నిర్మాణం కాలేదు. ఇందుకోసం నిర్మించిన (ఇనుప పిల్లర్లు, బుట్టలు) స్లాబ్ కోసం కొనుగోలు చేసిన ఇనుము ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పు పట్టి పోతుంది. పాడైపోయిన, పడగొట్టి న తరగతి గదులను కూల్చిన స్థానంలో అదనంగా నిర్మించాల్సిన నాలుగు తరగతి గదులు నేటికీ నిర్మాణం కాలేదు. ఫలితంగా విద్యార్థులు, తరగతి గదులు సరిపడా లేక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు 132 మంది విద్యార్థిని విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఎలిమెంటరీ పాఠశాలలో 90 మంది విద్యార్థిని విద్యార్థులు తమ చదువులు కొనసాగిస్తున్నారు. నాడు - నేడు పథకం కింద, సెంట్రల్ ప్రొక్యూర్మెంట్ మెటీరియల్(సిపిఎం) పథకంలో భాగంగా ఉపాధ్యాయులను ఈ పనుల్లో భాగస్వామ్యం చేశారు. మెటీరియల్ ప్రభుత్వం నియమించిన సంబంధిత కాంట్రాక్టర్ కొనుగోలు చేయొచ్చు. కొత్త మెటీరియల్ ప్రభుత్వం ఇస్తుంది. అలా ఇచ్చిన, అలా కొనుగోలు చేసిన మెటీరియల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విడుదలైన నిధుల నుండి డ్రా చేసి సంబంధిత పనులు చేసిన వ్యక్తులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఇది దేశంలోనే పెద్ద గొప్ప పథకమని అప్పటి ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. తీరాచూస్తే ఈ పథకం కోసం రూపొందించిన విధి విధానాలు లోపా భూయిష్టంగా ఉన్నాయని పనులు జరిగిన తీరు చూస్తే అర్థమవుతుంది. ఇప్పటికీ రూ 74 లక్షలు విడుదల కాలేదు. విడుదలై సిద్ధంగా ఉన్న రూ.4 లక్షలు ప్రధానోపాధ్యాయులు డ్రా చేయటానికి వీలు లేని పరిస్థితి నెలకొంది. ఐదు తరగతి గదులకు అప్పట్లో ఎస్టిమేషన్ వేశారు. నాలుగు తరగతి గదులు మంజూరు చేశారు. తరువాత వాటిని రెండు గదులకు కుదించారు. ప్రస్తుతం ఒక గది మాత్రం శాంక్షన్ అయింది. నిర్మాణం మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు వెక్కిరిస్తుంది. తరగతి గదుల నిర్మాణం కోసం ఇంతవరకు ఒక్క ఇటుక రాయి కూడా పేర్చిన పాపాన పోలేదు. రాజుల సొమ్ము రాళ్లపాలు అన్నట్లు, ఈ పథకం కింద నిర్మాణం కోసం వెచ్చిస్తున్న ప్రజల డబ్బు (ఇనుము తదితర మెటీరియల్స్) తుప్పుబట్టి పాడైపోతుంది. స్థానిక శాసనసభ్యులు, మరియు విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో ఈ పాఠశాల ఉంది. నాడు నేడు పేరు మార్చి మనబడి - మన భవిష్యత్తు పేరుతో ప్రభుత్వం విద్యా విధానం కొనసాగిస్తుంది. విద్యార్థిని విద్యార్థులకు భవిష్యత్తు కానరాన్ని ఈ పాఠశాలను గత డిజైన్ కు అనుగుణంగా అదనపు తరగతి గదులతో పాటు మిగతా నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




స్కూల్‌ను సందర్శించిన సిపిఎం నాయకులు, శిలాఫలకం



తుప్పుపట్టి పోయిన ఇనుప చువ్వలు

ఆట స్థలం కావాలి : సుమారు 222 మంది విద్యార్థినీ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న ఈ పాఠశాలలో ఆట స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. అనుకున్న విధంగా తరగతి గదులు పూర్తయితే పిల్లలు ఆడుకోవటానికి ఇప్పుడున్న స్థలం మరింత కుషించుకుపోతుంది. ఈ ప్రాంతంలోని భూములన్నీ రాజధాని నిర్మాణం కోసం రైతులు పోలింగ్లు లు ఇచ్చారు. ప్రభుత్వం 50 సెంట్లు స్థలాన్ని ఈ పాఠశాలకు ఆటస్థలంగా కేటాయించాలని సమాజ అభివఅద్ధిని ఆకాంక్షించేవారు కోరుతున్నారు.

సిపిఎం నాయకులు సందర్శన

నులకపేట జిల్లా పరిషత్ హై స్కూల్లో నిలిచిపోయిన అభివఅద్ధి పనులను సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు. నాయకులు వేముల దుర్గారావు, ఎ.సేవిరి భర్తలం, బి.యేసయ్యా బుధవారం సందర్శించారు. విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నానని చెబుతున్న మంత్రి నారా లోకేష్ అసంపూర్తిగా మిగిలిపోయిన తరగతి గదులతో పాటు మిగిలిన అభివఅద్ధి పనులను పూర్తి చేయాలని కోరారు. పిల్లలు ఆడుకునేందుకు వీలుగా 50 సెంట్లు స్థలం కేటాయించాలని కోరారు.

రెండు మంజూరు చేశారు.. ఒకటి ఫైనల్ అయింది : ఎంఈఓ శాంత కుమారి

నులకపేట జిల్లా పరిషత్ హై స్కూల్‌కు సంబంధించి గతంలో రెండు అదనపు గదులు శాంక్షన్ చేశారు. ప్రస్తుతం ఒక గది శాంక్షన్ అయింది. నిధులు విడుదల కాగానే పనులు మొదలుపెడతాం జరుగుతుంది.



ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ సెక్రటరీ ఫాదర్ బాలస్వామి

విహెచ్‌జిటి కంపెనీ ఇంటర్న్‌షిప్‌కు యూనివర్సల్ ఇంజినీరింగ్ విద్యార్థులు

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని డోకిపర్రు సమీపంలోని యూనివర్సల్ కాలేజీ ఆఫ్ ఇంజినీర్ అండ్ టెక్నాలజీ కళాశాల లో జరిగిన విహెచ్‌జిటి కంపెనీ నిర్వహించిన పరీక్షలలో అత్యంత ప్రతిభ కనపరిచి, ఆ కంపెనీ ఇంటర్న్‌షిప్‌కు యూనివర్సల్ విద్యార్థులు ఎన్నిక అయినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. కోటిరెడ్డి తెలియజేసారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ రెవ. ఫాదర్ పామిశెట్టి బాలస్వామి మాట్లాడుతు, తమ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికవడం చాలా సంతోషకరమని తెలియజేస్తూ, విద్యార్థులను అభినందించారు. కష్టపడి ఉన్నత స్థాయికి వెళ్లి ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలవాలి అని విద్యార్థులను కోరారు. ప్రతి విద్యార్థి తమలో దాగివున్న ప్రతిభకు పోదును పెట్టాలని ఆకాంక్షించారు. కళాశాల టీపీవో మహేష్ మాట్లాడుతూ కళాశాల మారుతున్న కాలానుగుణంగా పోటీ తత్వం ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని అన్నారు. కళాశాల మేనేజ్మెంట్ సహకారం తోనే మంచి శిక్షణ ఇప్పించగలిగాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఈ హెచ్ఓడి డాక్టర్ వీరకుమారి, పలువురు విద్యార్థిని, విద్యార్థులు అధ్యాపక సిబ్బంది తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

19 చలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

స్త్రీ శక్తి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్స్ ను ప్రభుత్వం ఆదుకోవాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్ పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రత్తిపాడు ఆటో స్టాండ్‌ల వద్ద స్త్రీ శక్తి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. శివాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు జరుపుతున్న నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని శివాజీ డిమాండ్ చేశారు. ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు లేక నిరుద్యోగులు అనేక మంది వ్యవసాయం లాభసాటి లేక యువత ప్రైవేట్ ఫైనాన్సర్ల వద్ద అప్పు చేసిమరియు బ్యాంకుల వద్ద లోను ద్వారా ఆటోలు కొనుగోలు చేసి ప్రతినెల ఫైనాన్స్ కిస్తీలు చెల్లిస్తూ పిల్లల్ని చదివించు కుంటూ కుటుంబం పోషించుకుంటూ రాష్ట్రంలో సుమారు పది లక్షల కుటుంబాలు స్వయం ఉపాధి పొందుతున్నారు ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులో ఉన్న నేపథ్యంలో ఆటో కార్మికులకు బాడుగలు తగ్గాయి అన్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ అమలు చేయాలి డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర పథకం క్రింద 25000 ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని వాహన కొనుగోలుకి బ్యాంకుల ద్వారా 4 1/2 లక్షల రూపాయలు సబ్సిడీ తో కూడిన వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని పట్టణ మండల కేంద్రాలలో ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని ఓలా ఓబర్ కంపెనీలు నడుపుతున్న యాప్ రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వమే యాప్ నిర్వహించాలి, వాహన ఫిట్నెస్ ఏటఎస్ ఆటోమేటిక్ ట్రాకులు ప్రైవేటు వారికి ఇవ్వడం రద్దు చేయాలని, వాహన ఫిట్నెస్ ప్రభుత్వమే నిర్వహించాలని ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జీవో నెంబర్ 21 రద్దు చేయాలని అన్ని రకాల ఫీజులు పెనాల్టీలు తగ్గించాలని లేనిపక్షంలో దశల వారి ఆందోళనకు సిఐటియు పిలుపునిచ్చిందన్నారు. సెప్టెంబర్ 19వ చలో విజయవాడ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, సిఐటియు స్థానిక నాయకులు కె.ఆదినారాయణలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ఆటో కార్మికులు వ్యతిరేకం కాదని, ఆటో కార్మికులకు బాడుగలు తగ్గిపోయి కుటుంబాలు ఇబ్బందులు పాలవుతున్న నేపథ్యంలో స్వయం ఉపాధి పొందుతున్న ఆటో కార్మికులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు ప్రభుత్వం చూపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు యాకోబు, శ్రీకాంత్, ఆశీర్వాదం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆటో కార్మికులతో మాట్లాడుతున్న నన్నపనేని శివాజీ, బి.లక్ష్మణరావు



మాట్లాడుతున్న సిఐటియు పట్టణ కార్యదర్శి బాలాజీ

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి

డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని ఎయిమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎం.బాలాజీ అన్నారు. బుధవారం మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో ఎయిమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ సమావేశం నిర్వహించారు. సిఐటియు కార్మికుల హక్కుల సాధన కొరకు నిరంతరం పనిచేస్తుందని అన్నారు. 11 సంవత్సరాల నుంచి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా ప్రజావ్యతిరేక పాలన కొనసాగిస్తున్నాయని విమర్శించారు. బిజెపి హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి కార్మికుల్లో చీలిక తెచ్చేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. కార్మిక వర్గ ప్రయోజనాల కోసం దేశవ్యాప్తంగా సిఐటియు పనిచేస్తుందని అన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి బిజెపి అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జాతీయ మహాసభల సందర్భంగా 2026 జనవరి 4వ తేదీన విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభకు మంగళగిరి ప్రాంతం నుండి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్.ఎస్.చెంగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.బుజ్జిబాబు, నాయకులు గాలి శ్రీనివాసరావు, రాజమోహన్, ఎ.రవి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



చేతిపంపును బాగు చేస్తున్న సిబ్బంది

చేతిపంపును బాగు చేశారు..

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఫిరంగిపురం

స్థానిక మండలంలోని గుండాలపాడు అగ్రహారం హరిదాసులు కాలనీలోని రెండు చేతిపంపులు ఎనిమిది నెలల నుండి పనిచేయడం లేదు. ఈ సమస్యపై ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తలకు స్పందించిన సంబంధిత అధికారులు రెండు చేతి పంపులను బాగు చేసి ప్రజలకు నీరు అందించారు. స్థానిక ప్రజలు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రతి అర్జీనీ పరిష్కరిస్తాం : సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి - కొల్లిపర

గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరిస్తామని తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహ అన్నారు బుధవారం కొలిపర మండలం దావులూరు దావులూరు పాలెం, అత్తోట గ్రామాల్లో గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను పరిశీలించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించారు గ్రామస్తులతోనూ అర్జీదారులతోనూ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు సమగ్ర నివేదిక తయారు చేసి సమర్పించాలని తహశీల్దార్‌ను కోరినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిద్ధార్థ ఆయా గ్రామాల వీఆర్వోలు విఏవోలు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సంజనాసింహ

రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-ఈపూరు

రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా మార్కెట్ యార్డ్ కమిటీ పని చేస్తోందని చైర్మన్ జరపాల రాములు బాయి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయంలో తొలిసమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిట్టుబాటు ధర లభించని పంటలను కొనుగోలు చేసేందుకు మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు గోదాములలో నిల్వ ఉంచే ధాన్యం బస్తాల అద్దె, ఇన్సూరెన్స్ ధరలను తగ్గించేలా తీర్మానం చేశామని తెలిపారు. అనంతరం మార్కెట్‌యార్డ్ సెక్రటరీ సూరే శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎ ముప్పాళ్ళ గ్రామంలో సబ్‌యార్డు గోదాము పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో మరో వెయ్యి మెట్రిక్ టన్నుల గోదాము, వెల్లటూరు గ్రామంలో ఉన్న యార్డు గోదాము ముందు ఖాళీ స్థలంలో గ్రావెల్‌రోడ్డు పనులు, ఈపూరులో ఒకటోనెంబర్ గోదాము మరమ్మత్తులు, వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయ ఆధునీకరణ పనులు, మార్కెట్‌యార్డ్ ముందు భాగంలో ఆర్చి నిర్మాణం చేపట్టడం కోసం నిధులు మంజూరు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. వైస్‌చైర్మన్ గోరంట్ల సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశానికి రాని అధికారులకు మెమో

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం బుధవారం ఎంపీపీ పిడతల ఝాన్సీ సాగర్ ఆధ్వర్యంలో ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశానికి రాని అధికారులకు మెమో ఇవ్వాలని ఎంపీడీవోను అదేశించారు. అనంతరం ప్రారంభించిన సమావేశంలో తొలుత పంచాయతీ రాజ్‌శాఖకు సంబంధించిన కార్యక్రమాలను వివరించారు. తదుపరి వ్యవసాయ శాఖకు సంబంధించిన వివరాలు తెలిపినప్పుడు చెంఘీస్కాన్ పేట పంచాయితీ ఉపసర్పంచ్, ప్రస్తుత సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మా పంచాయితీలో రైతులు ఎరువులు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఏవో హరి ప్రసాద్ వివరిస్తూ గ్రామంలోని రైతు సేవాకేంద్రంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎంపీడివో హేమలతాదేవి, డిప్యూటి తహశీల్దార్ అనురాధ,పంచాయతీ కార్యదర్శులు శశికళ,డాక్టర్ భరద్వాజ్ ఎంపీటీసీలు, మద్దూరి శ్రీనివాస్ రెడ్డి,కీర్తి అరుణ్ కుమార్, సర్పంచ్లు పాల్గొన్నారు.

10న ఐద్వా పల్నాడు జిల్లా మహాసభ

ప్రజాశక్తి-ముప్పాళ్ల

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం పల్నాడు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మహిళా సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని పిలుపునిచ్చారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో కరపత్రాల పంపిణీలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సమానత్వం విముక్తి నినాదంతో 1936 సంవత్సరంలో ఏర్పడిన మహిళా సంఘం ఆనాటి నుండి ఈనాటి వరకు మహిళా సమస్యపైన అనేక ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. సత్తెనపల్లి పట్టణంలోని మహిళా సంఘం కార్యాలయంలో మహిళలకు అండగా న్యాయ సలహా కేంద్రం ఏర్పాటు చేసి సమస్యలపై కృషి చేస్తున్నామన్నారు. ఇతర ప్రజాసంఘాలతో కలిసి మెడికల్ క్యాంపులు కూడా నిర్వహిస్తారని ఆమె అన్నారు. నిరంతరం ప్రజామహిళా సమస్యలపై కృషి చేసే మహిళా సంఘం జిల్లా మహాసభ ఈనెల 10వ తేదీన తెలంగాణ పోరాటానికి ఉద్యమకారులకు అండగా నిలిచిన రెంటపాళ్ళ గ్రామంలో నిర్వహించనున్నామనీ, ఈ మహాసభలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళా సంఘం నాయకులు రాయలశివ, పద్మ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో విలీనం చేయవద్దు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మున్సిపాలిటీలో మా గ్రామాన్ని విలీనం చేయవద్దని సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామస్తులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయం వద్ద ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేపట్టారు. మున్సి పాలిటీ వద్దు గ్రామ పంచాయతీ ముద్దు అంటూ నినాదాలు చేశారు. మున్సిపాలిటీలో పంచాయతీ విలీన ప్రక్రియను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు అనంతరం సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.



జీవాల పెంపకతోనే జీవనం

ప్రజాశక్తి - రొంపిచర్ల

చదువుసంధ్య లేకపోయినా నాలుగు గేదెలు కాసుకుంటే సరిపోతుందనేది పాత సామెతయితే... జీవితంలో ఆర్థికంగా నిలుదొక్కుకోవాలంటే 40 జీవాలు (గొర్రెలు) పెంచుకుంటే సరి అన్నది నేటి సామెతగా మారింది. వివరాల్లోకి వెళితే సరైన విద్యాబుద్ధులు లేకనో ఆశించిన ఉపాధి దొరకకనో..లేక సామాజికపరంగా ఎన్నో తరాలుగా వస్తున్న వృత్తిని కొనసాగించి జీవనం సాగించాలన్న సంకల్పంతో గ్రామీణప్రాంతాలలోని కొందరు వ్యక్తులు గొర్రెల పెంపకంపై దృష్టి సారించి ఆర్థికంగా నిలదొక్కుకుని పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. తక్కువ పెట్టుబడికి తోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం లభిస్తుండటంతో గ్రామీణ రైతులు అధికసంఖ్యలో జీవాల పెంపకంవైపు మొగ్గు చూపిస్తున్నారు. దీనికి తోడు బహిరంగ మార్కెట్లో వీటి మాంసానికి గిరాకీ పెరగడంతో ఏడాది కష్టపడితే లాభాలు వస్తాయని భావించి తమ స్థోమతకు తగిన విధంగా పసి గొర్రెలను కొనుగోలు చేసి వాటిని పెద్దవి చేసేందుకు శ్రమిస్తున్నారు. అనుకోకుండా ఎదురైయ్యే సమస్యలను పరిష్కరించుకుని ముందుకు నడుస్తున్నారు. గొర్రెల పెంపకం అంత సులువు కాదు. సీజనల్‌గా వ్యాపించే అనేక అంటువ్యాధులు, సహజంగా సంక్రమించే రుగ్మతలకు వైద్యసేవలు అందించాల్సిన ఉంటుంది. ప్రమాదాలు జరిగో, అనారోగ్యం కారణంగానో జీవాలకు ఏవిధమైన నష్టం జరిగినా ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన నేషనల్ లైవ్‌మిషన్ ద్వారా పెంపకందారులు లబ్ది పొందేందుకు అవకాశం ఉంది. వ్యక్తిగతంగా కానీ, గ్రూపులుగానీ గొర్రెల పెంపకంపై ఆసక్తి ఉంటే సుమారు రూ.కోటి విలువైన 500గొర్రెలతో పాటు 25 పొట్టేళ్ళను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తోంది. జీవాలకు బీమా పథకాలను ప్రవేశపెట్టి తక్కువ ప్రీమియం చెల్లింపు ద్వారా భరోసా కల్పించారు. అయితే ప్రస్తుతం వర్షాకాలంలో జీవాలకు సోకే గాలికుంటు, పారుడు వ్యాధులపట్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాదికారులు సూచిస్తు న్నారు. ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహం అందిస్తే పెంపకందారులకు ఆర్థిక వెసులుబాటు కలిగే అవకాశం ఉంటుందని పలువురు పెంపకం దారులు చెప్పుకొచ్చారు.

కాసు మహేష్‌రెడ్డి వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మాచవరం మండలంలో జరిగిన ఒక సభలో మాజీ శాసనసభ్యులు కాసు మహేష్‌రెడ్డి మాట్లాడిన మాటలపై కూటమి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం కూటమి నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పుడు కర్రలతో చెబుతున్నాం రేపు అధికారంలోకి వచ్చిన తర్వాత కత్తులతో గొడ్డళ్లతో సమాధానం చెబుతామని వైసిపి కార్యకర్తలను రెచ్చ గొడుతూ మాట్లాడటం తన అవివేకానికి అహంకారానికి నిదర్శనమని అన్నారు. గురజాల నియోజకవర్గ శాసన సభ్యులు అభివృద్ధి ప్రదాత యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన స్త్రీ శక్తి విజయోత్సవ మహాసభకు 30 వేల మంది మహిళలు విచ్చేసి సభను విజయవంతం చేయటం చూసి మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. అనంతరం ప్రశాంతంగా ఉన్న గురజాల నియోజకవర్గంలో ఇలాంటి రెచ్చగొట్టే మాటలు చెప్పి వైషమ్యాలు సృష్టించాలని చూస్తున్న కాసు మహేష్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు, మార్కెట్‌యార్డ్ చైర్మన్ తురకా వీరాస్వామీ, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్ బాబావలి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ముప్పన వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి పణితి రవి, పల్నాడు జిల్లా మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ అమీర్‌అలీ, జనసేన మండల కన్వీనర్ కామిశెట్టి రమేష్, జనసేన జిల్లా నాయకులు దూదేకుల ఖాసీంసైదా, టీడీపీ మండల కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు, జిడిసిసి బ్యాంక్ మాజీ డైరెక్టర్ వడ్డవల్లి సర్వేశ్వరరావు, టిడిపి జిల్లా మహిళా కార్యదర్శి పాదర్తి రాజేశ్వరి, పట్టణ మహిళా అధ్యక్షురాలు చల్లగుండ్ల సీత, క్లస్టర్ ఇంచార్జ్ పిల్లి చెన్నారావు, పట్టణ అధికార ప్రతినిధి మందా డేవిడ్,జిల్లా ఉపాధ్యక్షులు మేకల సాంబశివరావు, యడ్లపల్లి శివ, కోట హరి, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు కేంద్రాల ద్వారా ఎరువుల సరఫరా

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి రైతుసేవ కేంద్రం ద్వారా రైతులకు యూరియా కట్టలను అందజేసినట్లు ఏవో బాలాజీ గంగాధర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతి రైతుకు సేవ కేంద్రం ద్వారా యూరియా ఎరువు కట్టలను అందజేస్తామనీ, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. సిఫారసు చేసినంత మేరకే ఉపయోగించుకోవాలని ఎక్కువ కట్టలను వాడుకోవద్దని సూచించారు. గొట్టేపాల, సిరిగిరిపాడు రైతు సేవా కేంద్రాలలోనూ ఎరువులను అందజేస్తామని తెలిపారు. రైతులు రైతుకే సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగు మండల సమాఖ్య భవనం ప్రారంభం

ప్రజాశక్తి - రెంటచింతల

మహిళల ఆర్థిక స్వావలంబనకు కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడానికి ఋణాల చెల్లింపులో అవకతవకలకు అడ్డుకట్ట వేయడానికి మొబైల్ బుక్ కీపింగ్ 2.0ను అందుబాటులోకి తెచ్చిందని ఎంపీడీవో సిహెచ్.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో రూ.10లక్షలతో గతంలోనే నిర్మించిన మండల సమాఖ్య భవనాన్ని ఎంపీడీవోతో పాటు వెలుగుఏపిఎం కృష్ణవేణి టిడిపి మండల అధ్యక్షులు అబ్బిరెడ్డితో కలిసి ప్రారంభించారు. మండలంలో1014 డ్వాక్రాగ్రూపులున్నాయని రూ.9 కోట్ల 25 లక్షల రుణ సౌకర్యం కల్పించారని కృష్ణవేణి తెలిపారు. టిడిపికి చెందిన సుమంత్‌రెడ్డి, రామకృష్ణ ప్రభురాజు వెలుగు సీసీలు గ్రామసమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

టైల్‌పాండ్ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోనే సత్రశాల వద్ద కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో మంగళవారం అర్ధరాత్రి 12గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 0.177 ఏంయుల విద్యుత్తును తయారు చేసినట్లు ఎస్‌ఈ కే.వెంకట రమణ తెలిపారు. ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ గేట్లకు గాను మూడు గేట్లను 1.5 మీటరు, ఒక గేటును ఒక మీటర్ మేర ఎత్తి 25,492 క్యూసెక్కులు నీరు విద్యుత్తు తయారీ అనంతరం టెల్‌రేస్ ఛానల్ ద్వారా 8626 మొత్తంగా 34,118 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు రిజర్వాయర్లో 75.50 (పూర్తిస్థాయి75.50) మీటర్ల మేర నీరు ఉండగా ఈ నీరు 7.080 (పూర్తిస్థాయి7.080) టీఎంసీలకు సమానం అన్నారు.

కిడ్స్ పాఠశాల ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - మాచర్ల

ప్రవేట్ టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్స్ యూనియన్ ఆధ్వర్యంలో టీచర్స్ డే సెలబ్రేషన్స్ గుంటూరు విద్యానగర్‌లోని హర్ష ఐఐటి మెడికల్ అకాడమీలో బుధవారం జరిగాయి. మాచర్ల పట్టణంలోని కెసిపి యాజమాన్యం నిర్వహించే కిడ్స్ పాఠశాల ఉపాధ్యాయులు యస్. పవన్‌కుమార్ ఫిజికల్ సైన్స్ అసిస్టెంట్, సిహెచ్ ఆనందరావు సోషల్ సైన్స్ అసిస్టెంట్‌ను పిటిఎల్‌యు రాష్ట్ర అధ్యక్షులు కే. బాబ్జి, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ సన్మానించారు. మాచర్ల కిడ్స్ పాఠశాల నుంచి యస్. పవన్‌కుమార్, సిహెచ్ ఆనందరావ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నిక కావడం గర్వంగా ఉందని కెసిపి యాజమాన్యం, కిడ్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ శాస్త్రి అన్నారు.



ఉపాధ్యాయున్ని సన్మానిస్తున్న బాబ్జీ, రామకృష్ణ

మహిళా, బాలికల జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మహిళా, బాలికల స్నేహ పూర్వక గ్రామ పంచాయతీల జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగింది. శిక్షణా కార్యక్రమంలో భాగంగా వీరికి ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, స్థానిక సుస్థిరఅభివృద్ధి లక్ష్యాలు, మహిళా, బాలికల స్నేహ పూర్వక గ్రామ పంచాయతీలు దృష్టి సారించాల్సిన ఆరోగ్యం, పోషణ, విద్య నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక అవ కాశాలు, లింగ ఆధారిత హింస, హింసను ప్రేరేపించే పద్ధతులకు వ్యతిరేక చర్యలు, పాలనలో మహిళా సర్పంచ్‌ల భాగస్వామ్యం, లింగ ప్రతిస్పందన ప్రణాళిక, బడ్జెటింగ్ అంశాలపై శిక్షణ ఇచ్చారు. నందిగామ పంచాయతీ కార్య దర్శులు కుంభ వెంకటేశ్వర్లు, చిలువూరి కృష్ణప్రసాద్, మహిళా శిశు సంరక్షణ కార్యదర్శి బి.పావని మాస్టర్ ఆఫ్ ట్రైనర్‌లుగా వ్యవహరించారు. డీఎల్‌డీవో రాజగోపాల్, ఇంచార్జి ఎంపిడిఓ టి.శ్రీనివాసరావు, ఇంచార్జి డిప్యూటీ ఎంపిడిఓ షేక్ అజీజుర్ రెహమాన్, జూనియర్ అసిస్టెంట్ విజయసుందర్ దాస్, అసిస్ట్ ట్రైనర్ చెంబేటి బొల్లయ్య సత్తెనపల్లి మండలం నందిగామ గురజాల మండలం దైద, దాచేపల్లి మండలం గామాలపాడు, కొత్తూరు, యడ్లపాడు మండలం దింటెనపాడు మహిళ కార్యదర్శులు, సర్పంచ్ పాల్గొన్నారు.

పోటాపోటీగా డాన్స్ బేబీ డాన్స్

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఓల్డ్ టౌన్‌లోనే చిన్న రామాలయం వీధిలో శ్రీ సీతారామ గణేష్ సేవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన డాన్స్ బేబీడాన్స్ పోటీలు ఆసక్తికరంగా జరిగాయి. పోటీలలో ప్రథమ బహుమతి రూ.5 వేలు కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి టి.దీక్షిత్‌రెడ్డి సాధించారు. రెండవ బహుమతి రూ.3 వేలు భావని, వైష్ణవి, జాహ్నవి, మూడవ బహుమతి రూ.2 వేలు ఓ.లక్ష్మీ, కన్సేషనల్ బహుమతులు దీక్షిత, అమ్ములు సాధించారు. న్యాయనిర్ణేతలుగా డాన్స్ మాస్టర్ శ్రీను, రాము వ్యవహరించారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులు డాక్టర్ గుర్రం రాజశేఖర్ రెడ్డి, ప్రతిభ కళాశాల డైరెక్టర్లు నాగులవలి, నారాయణ, ఆర్య వైశ్యసంఘ నాయకులు కంభంపాటి అనిల్‌కుమార్, కమిటీ నిర్వాహకులు ఓరుగంటి పురుషోత్తం, బత్తినపాటి వాసవీదత్, నాగరాజు, లక్ష్మణ్‌కుమార్, వేముల భార్గవ్, పులక సాయి, చంద్రపట్ల సాయి పాల్గొన్నారు.

ఘనంగా నాగం కార్తిక్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

టిడిపి సత్తెనపల్లి పట్టణ తెలుగుయువత అధ్యక్షులు నాగంకార్తీక్ జన్మదిన వేడుకలు బుధవారం మాజీ ఎపిపి బగ్గి నరసింహారావు ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు కార్తిక్‌చేత కేక్‌కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. టిడిపి పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు బిఎల్ చిన్నయ్య, బిక్కి నాగేశ్వరరావు సత్కరించారు. శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు యువత అధ్యక్షులు కార్తీక్ మాట్లాడుతూ పుట్టిన రోజు ఇంత నిర్వహిం చిన నిర్వాహకులకు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

పి-4పై ప్రత్యేకాధికారి సమీక్ష

ప్రజాశక్తి - పెదకూరపాడు

పి-ఫోర్‌పై సమీక్ష సమావేశాన్ని నియోజకవర్గ పి ఫోర్ ప్రత్యేక అధికారి నారదముని నిర్వహించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పి-ఫోర్ సిబ్బందితో సమావేశమయ్యారు. సిబ్బందికి ఏయే విభా గాల్లో ఎలా పనిచేయాలి అనే అంశాలపై ఆయన వివరించారు. ఎంపీడీవో సోమయాజులు, యంగ్ ప్రొఫెషనల్ సురేషు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులు సకాలంలో హాజరు కావాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఉద్యోగులందరూ తమ విధి నిర్వహణకు సకాలంలో హాజరుకావాలని నియోజకవర్గ పి-ఫోర్ ప్రత్యేక అధికారి నారదముని కోరారు. బుధవారం మండల పరిషత్తు కార్యాలయ సిబ్బంది హాజరు పట్టిని ఆయన పరిశీలించారు. కొంతమంది సిబ్బంది సకాలంలో హాజరు కాలేదు. వారికి ఫోన్ చేసి విధి నిర్వహణలో అలసత్వం పనికిరాదన్నారు. సమయపాలన పాటించాలని కోరారు. రోజువారీ పనులు పెండింగ్ ఉంచకుండా చూడాలని కోరారు. ఆయనతో పాటు ఎండిఓ సోమయాజులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి ఇన్‌ఛార్జి ఎడిఎగా విజయబాబు

ప్రజాశక్తి - తెనాలి



తెనాలి వ్యవసాయ సహాయ సంచాలకులుగా (ఇన్‌చార్జి) రాగాల విజయబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారిగా ఉన్నారు. ప్రస్తుతం ఇప్పటివరకు ఏడిఎగా బాధ్యతలు నిర్వహించిన రాజకుమారి ఎపిసిఎన్ఎఫ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ రైతులు తప్పని సరిగా ఈ క్రాప్ బుకింగ్ చేసుకునేలా అవగాహన కల్పించాలని, సిసిఆర్‌సి కార్డ్స్ టార్గెట్స్ పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏవో సుధీర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

కూటమి ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ బుధవారం లాంఛనంగా ప్రారంభమైంది. మంగళగిరి రత్నాలచెరువు 21, 22 వార్డులకు సంబంధించి స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో తహశీల్దార్ కె.దినేష్ రాఘవేంద్ర, రాష్ట్ర పద్మశాలీయ సంక్షేమం, అభివృద్ధి సంస్థ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్, బీసీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుత్తికొండ ధనుంజయ రావు, టీడీపీ పట్టణ ప్రధానకార్యదర్శి షేక్ రియాజ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు, టీడీపీ నేతలు దామర్ల రాజు, కారంపూడి అంకమ్మరావు, మాజేటి సూర్య వేణుగోపాలకృష్ణశ్రేష్టి, జంజనం వెంకట సుబ్బారావు, మాకా మాధవరావు, గోసాల రాఘవ, జన్నాదుల బాలకృష్ణ, పొట్లాబత్తుని లక్ష్మణరావు, వంగర హనుమాన్, 21, 22 వార్డుల నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు, వేణు

కోలాహలంగా సొసైటీ చైర్మన్ బత్తిన వేణు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు ప్రాథమిక పరపతి సంఘం (పిఎసిఎస్) చైర్ పర్సన్‌గా కొప్పరు గ్రామానికి చెందిన బత్తిన వేణుగోపాలకృష్ణ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా నల్లూరి వెంకటేశ్వర్లు, కాంద్రు సత్యవతి నియమితులయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రత్తిపాడు శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడే కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం రైతుల అభివఅద్ధికి తోడ్పడే ప్రభుత్వం అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, దీపం పథకం అమలు చేశామని తెలిపారు. నూతన చైర్ పర్సన్ బత్తిన వేణు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం, సొసైటీ అభివృద్ధికి అహర్నిశలు కఅషి చేస్తానని తెలిపారు. సుమారు 200 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. సొసైటీ ఆఫీసులో ప్రమాణస్వీకారం అనంతరం, పాత బస్టాండ్ సెంటర్ లోని రామాలయం కళ్యాణ మండపంలో అభినందన సభ నిర్వహించారు. సొసైటీ కార్యదర్శి కొండెపాటి భాస్కరరావు, సిబ్బంది ఎం మహేంద్ర, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, ముద్దన రాఘవయ్య, బత్తిన శారద, సంగం డైరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, తెలుగు రైతు నాయకులు మోపర్తి చెంచయ్య, చాగంటి సత్య హర్ష, నూతి శ్రీనివాసరావు, బండి నాగబాబు, చెన్నుపాటి శివ నాగేశ్వరరావు, బి.రాంబాబు, ఆళ్ల ఫణి కుమార్ పాల్గొన్నారు.

జనవరి 4న విశాఖపట్నంలో కార్మిక మహార్యాలీ : సిఐటియు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



మాట్లాడుతున్న ఎం.రవి

జనవరి 4న విశాఖపట్నంలో జరిగే మహార్యాలీలో రాజధాని ప్రాంతం నుండి అన్ని రంగాల కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి కోరారు. యర్రబాలెంలో బుధవారం ఎంటిఎంసి మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం టి. ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రవి మాట్లాడుతూ సిఐటియు అఖిల భారత 18వ మహాసభల ను జయప్రదం చేయాలని కోరారు. ఆ సందర్భంగా జనవరి 4న విశాఖపట్నంలో జరిగే కార్మిక మహార్యాలీలో రాజధాని ప్రాంతం నుండి అన్ని రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికు లు గతంలో 17 రోజుల చేసిన సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని, 12వ పిఆర్సిని అమలు చేయాలని, మున్సిపల్ కార్మికలను పర్మినెంట్ చేయాలని, వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని, గ్రాట్యూటీ ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలనే తదితర డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ నెలలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళనలు నిర్వహించనున్నట్లుగా తెలిపారు. దశల వారీగా జరిగే ఆందోళనల్లో మున్సిపల్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని రవి కోరారు. ఈ సమావేశంలో ఎంటిఎంసి రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ యూనియన్ నాయకులు టి.బాబు, ఓ.రామారావు, కె.కోటేశ్వరి, ఎన్.దివ్య, ఎం.పార్వతి, ఎస్.కె. సుభాని తదితరులు పాల్గొన్నారు.

ఆశ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి- తాడేపల్లి



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు వేముల దుర్గారావు

తాడేపల్లి యు పీహెచ్సీ పరిధిలోని ఉండవల్లి మహానాడు ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఆశ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు తాడేపల్లి మండల గౌరవాధ్యక్షుడు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లి పీఏసీలోని ఆశ వర్కర్ల గ్రూపు సమావేశం జరిగింది. దుర్గారావు మాట్లాడుతూ ఆల్ ఇండియా సిఐటియు మహాసభలు విశాఖపట్నంలో జరగబోతున్నాయని, ఆ మహాసభల జయప్రదానికి ఆశా కార్యకర్తలు అందరూ తమ వంతు ఆర్థిక సహాయం అందించి జయప్రదానికి తోడ్పడాలని కోరారు. అనంతరం తాడేపల్లి పీఏసీ అధ్యక్షురాలుగా విశాలి కార్యదర్శిగా చంద్రకళను, మరో ఐదుగురిని కమిటీగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తాడేపల్లి మండల ఆశా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వేముల రేణుక పాల్గొన్నారు. అనంతరం పీహెచ్సీ డాక్టర్ శాంతికి వినతిపత్రం అందజేశారు.

బీసీలపై వివక్ష చూపుతున్న కూటమి ప్రభుత్వం : బీసీ సంక్షేమ సంఘం



మాట్లాడుతున్న కుమ్మర క్రాంతికుమార్

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం బీసీలపై వివక్షత చూపుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతి కుమార్ అన్నారు. బుధవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. క్రాంతి కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని, రాష్ట్రంలో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై బీసీలకు ఇచ్చిన హామీలపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. గుంటూరు జిల్లా అధ్యక్షులు పారెపల్లి మహేష్ మాట్లాడుతూ బీసీల కుల గణన ఏమైందని ప్రశ్నించారు. కూటమి ఏడాదిన్నర పాలనలో బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ కు ఒక్క రూపాయి నిధులు కేటాయించక పోవడం దుర్మార్గం అన్నారు. కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ జాయింట్ సెక్రటరీ తిరువీధుల కిరణ్, నియోజకవర్గ అధ్యక్షులు ఆలా శివాజీ యాదవ్, నియోజకవర్గ సహాయ కార్యదర్శి జంజనం వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన వార్డులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



అవగాహన కల్పిస్తున్న డిఎల్‌పిఓ శ్రీనివాసరావు, సిబ్బంది

స్థానిక పంచాయతీలోని మూడు వార్డులను స్వచ్ఛ మైన వార్డులుగా తీర్చిదిద్దాలని డి.ఎల్.పి. ఓ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ప్రత్తిపాడు గ్రామం పంచాయతీ సర్పంచ్ వి.రమాదేవి అధ్యక్షతన తడి పొడి చెత్తపైలో డి.ఎల్.పి.ఓ. శ్రీనివాసరావు పర్యటించారు. ప్రజలకు డోర్ టు డోర్ చెత్త బుట్టలు తడి పొడి చెత్త వ్యర్థాలపై అవగాహన కల్పించారు. ఐ.టి.సి., ఫినిష్ సొసైటీ సంస్థలు ప్రజలకు వ్యర్థాల నిర్వహణ బ్యాగ్‌లు పంపిణీ చేసి తడి పొడి అవగాహన తెలిపే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివ పార్వతి,డిప్యూటీ ఎంపీడీఓ షఫీ, ఇంచార్జ్ కార్యదర్శి షేక్ ఖాజా, స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు, వార్డు సభ్యులు కాకాని సురేష్, డబ్బూరి వెంకటేశ్వర్లు, మల్లం పరమేశ్వరవు, ఐటీసీ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ యశ్వంత్ శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

పారిశుధ్య నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయం

ప్రజాశక్తి - మంగళగిరి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

నవ్య నగరం మంగళగిరిని సంపూర్ణ పారిశుధ్య నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని నగర కమిషనర్ అలీం బాషా అన్నారు. బుధవారం ఆయన తెనాలి రోడ్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు. నగరంలో పారిశుధ్య సమస్య లేకుండా పనిచేయాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. గృహ యజమానులు పారిశుధ్య సిబ్బందికి తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇస్తున్నారా? లేదా? అని ఆరా తీయాలని సూచించారు. డ్రెయిన్లలో పూడికలు ఎప్పటికప్పుడు తొలగించడంతో పాటు ప్లాస్టిక్ నిషేధంపై చర్యలు చేపట్టాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌చేస్తే ఆయా ప్రాంతాల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు. అనంతరం కమిషనర్ అలీం బాషా లక్ష్మీనరసింహస్వామి కాలనీ పార్క్‌ను సందర్శించి పార్కులోని పరిశుభ్రత, ఇతర సౌకర్యాల గురించి సందర్శకులను అడిగి తెలుసుకున్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

274వ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 274వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ సభ్యులు వై.సాంబశివ రావు, బి.సూర్యప్రకాష్, షేక్ సుభాని, ఎం.ఆశీర్వాదం, తుపాకుల నాగేశ్వరావు ప్రారంభించారు. కార్యక్రమంలో జి.కృష్ణమూర్తి, సిహెచ్.పిచ్చయ్య, యహోషువ, బి.అంకయ్య, దేవరాజు, ఎం.గురవయ్య, ఆరిఫ్, పి.సాంబశివరావు, కొండా, ఎం.డి.ఇస్మాయిల్ మరియు మహిళలు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న భోగి వినోద్

ఘనంగా భోగి వినోద్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

తెలుగుయువత నియోజకవర్గం అధ్యక్షులు భోగి వినోద్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భం స్థానిక శ్రీకృష్ణ చైతన్య వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. తెలుగు యువత నాయకులు కట్టెపోగు రాజీవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర పద్మశాలియ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల నాగార్జున హాజరయ్యారు. కార్యక్రమంలో రేవేంద్రపాడు ఎంపీటీసీ సభ్యులు కుక్కల మధుబాబు, తెలుగు యువత నాయకులు ఎం.డి.ఆరిఫ్, కె కాశీ విశ్వనాథ్, షేక్ అన్వర్, కలకోటి శివ, దేవరకొండ సాయి, రవి, ఛాను, నితిన్, సాయి, క్రోసూరు రామ్ గోపాల్, తుళ్లూరు సాయి తదితరులు పాల్గొన్నారు.



వంగిపురం గ్రామంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

హెచ్‌ఐవి ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజక వర్గ పరిధిలోని వంగిపురం గ్రామంలో హెచ్ఐవి/ ఎయిడ్స్, మాదక ద్రవ్యాలపై లింక్ వర్కర్ స్కీమ్ ద్వారా అవగాహన కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ ఆదేశాలు మేరకు, గుంటూరు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మరియు నివారణ సంస్థ (దిశ) పర్యవేక్షణలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ప్రాజక్ట్ ఇంటెన్సీఫైడ్ ఐ ఈ సి క్యాంపెయిన్ 2025 ద్వారా గ్రామస్తులకు ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ సూపర్వైజర్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో సి హెచ్ ఓ బి.మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటేశ్వరమ్మ, సరస్వతీ, ఆశకార్య కర్తలు సరిత, వెంకాయమ్మ, లింక్ వర్కర్ మైమున్నీసా పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పవన్, సమీర్

ప్రజాశక్తి - గుంటూరు

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కె.పవన్ కుమార్, షేక్ సమీర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన జిల్లా విస్తృత సమావేశంలో నూతన అధ్యక్ష, కార్యదర్శులతోపాటు సహాయ కార్యదర్శులుగా యశ్వంత్, సౌమ్య ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కిరణ్ మాట్లాడారు. సమావేశంలో అభి, అనిల్, శ్రావణ్, అనిల్, హర్షిత, సింధుశ్రీ, అమృత పాల్గొన్నారు.


పవన్, సమీర్


ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ కార్యాలయం, విపూర్తిగా నీరు నిలిచి పాడైపోయిన అంతర్గత రోడ్లు, విచ్చల విడిగా పడి ఉన్న కార్ల విడిభాగాలు,

గుంటూరు ఆటోనగర్ వాసుల కష్టాలు తీరేదెన్నడో..?

- రాష్ట్రంలోని స్పేర్ పార్ట్స్‌లో ముఖ్యస్థానం
- స్థాపించి 45 ఏళ్లు గడుస్తున్న వసతులు కరువు
- కనీసం తాగునీరు, పారిశుధ్యం లేని దుస్థితి

ప్రజాశక్తి - పెదకాకాని

గుంటూరు ఆటోనగర్ వాసుల కష్టాలు ఎప్పుడు తీరతాయోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు ఆటోనగర్ అంటే రాష్ట్రంలో ఎక్కడ దొరకని సెకండ్ హ్యాండ్ స్పేర్ పార్ట్స్ దొరుకే చోటని ఆటోలు మొదలు కార్లు పెద్ద లారీల యజమానులకు అందరికీ తెలుసు. ఆటోనగర్ ఏర్పడి నలభై ఏళ్లు గడుస్తున్న మౌలిక వసతులు కరువై ఇక్కడి కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోనగర్లో అనేక దేశీయ అంతర్జాతీయ కంపెనీలు తమ వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తూ సుమారు 50 వేలకు మంది పైగా ఆటోనగర్లో ఉపాధి పొందుతున్నారు. వారికి కనీస అవసరాలు అయినా త్రాగునీరు అందకపోవడం ఆశ్చర్యం. త్రాగునీరు వాడకం కోసం మినరల్ వాటర్, వాడకం కోసం ట్రాక్టర్లను ఆశ్రయిస్తూ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇక్కడి కార్మికులు గ్రీసు పలు రకాల ఇంధనాలతో పని చేయవలసి వస్తున్నందున చేతులు శుభ్రం చేసుకోవడానికి సరిపడా నీరు లేక అదే చేతులతో భోజనం చేయడం వల్ల పలు రకాల అనారోగ్యాలకు గురి అవుతున్నారు. ఇక రోడ్ల విషయానికి వస్తే నీరు నిల్వ ఉండి ఇక్కడ మనుగడ సాగించే వారు తీవ్ర అసౌకర్యానికి, విష జ్వరాల బారిన పడుతున్నారు. ప్రభుత్వాలు మారిన ఆటోనగర్ అభివఅద్ధి నీటిపై రాతలు లాగా మిగిలిపోయాయి. ఇకనైనా ప్రజా ప్రతినిధులు అధికారులు ఆటోనగర్ వాసులకు కనీస మౌలిక అవసరాలైన త్రాగునీరు, పారిశుధ్యం, రోడ్లు వసతులు కల్పించాలని వేడుకుంటున్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో సెక్రటరీ, ప్రిన్సిపాల్

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌విఆర్ జెసి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - గుంటూరు

చెన్నై- తిరుచ్చికి చెందిన శ్రీ సాయి పవర్ అండ్ ఎక్విప్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రాంగణ ఎంపికల్లో 2025-26 విద్యా సంవత్సరానికి చెందిన ఫైనల్ ఇయర్ బ్యాచ్ ఈసీఈ నుండి ముగ్గురు, మెకానికల్ విభాగం నుండి 9 మంది, మొత్తం 12 మంది విద్యార్థులు రూ.2.5 లక్షల ప్యాకేజితో ఉద్యోగాలు సాధించారని కళాశాల డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను బుధవారం కళాశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, తదితరులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.


విద్యార్థులతో ఆక్మే స్కూల్ డైరెక్టర్ ఎన్.దీప్తి

ఆక్మే స్కూల్లో ఇంటరాక్ట్ క్లబ్ ఏర్పాటు

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక లక్ష్మీపురంలోని ఆక్మే స్కూల్లో రోటరీ క్లబ్ ఆఫ్ ఆదర్శ్ తరపున స్కూల్ విద్యార్థులకు విద్యార్థి దశ నుండే సేవా భావాన్ని పెంపొందించటానికి ఇంటరాక్ట్ క్లబ్‌ను ఆవిష్కరించారు. క్లబ్ ప్రెసిడెంట్‌గా కె.హవీష్, సెక్రెటరీగా బి.బృందా నియమతులయ్యారు. మరో 20 మందిని సభ్యులుగా నియమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ భాస్కరరావు, మోహన్, రోటరీ ఆదర్శ్ క్లబ్ సభ్యులు ఎం.అనురాధ, జయశ్రీ, వాణి, రోహిణీదేవి, ఆక్మే స్కూల్ డైరెక్టర్ ఎన్.దీప్తి పాల్గొని విద్యార్థులను అభినందించారు.

సునీతారజనీకి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక బ్రాడీపేటలోని శారదా నికేతనం ఓరియంటల్ ప్రభుత్వ పాఠశాలలో గణితం స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.సునీతారజని 2025 సంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డుకు ఎంపిక అయ్యారు. సునీతా రజని గత 9 సంవత్సరాలుగా పాఠశాలలో పనిచేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. అంతేకాకుండా లయన్స్‌క్లబ్ పట్టాభిపురంలో సెక్రెటరీగా ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పాలుపంచుకుంటున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన సునీతారజనీకి పాఠశాల హెచ్‌ఎం ఎన్.ఉషాకుమారి, సహా ఉపాధ్యాయులు, జిల్లా లయన్స్‌క్లబ్ పూర్వ గవర్నర్ నూతలపాటి వీరప్రకాష్, క్లబ్ అధ్యక్షులు రాధా, ఇతర సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

పుట్టపర్తి సాయిబాబా శతజయంతి ఉత్తర్వులను రద్దు చేయాలి


శతజయంతి ఉత్తర్వులను రద్దు చేయాలి కోరుతున్న నాయకులు

ప్రజాశక్తి - గుంటూరు

పుట్టపర్తి సాయిబాబా శతజయంతిని ప్రభుత్వ పండుగగా జరపాలనే ప్రభుత్వ జిఒ 862ను రద్దు చేయాలని భారతహేతువాద సంఘం అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య కోరారు. బ్రాడీపేటలోని ఎస్ఎహెచ్ఒ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిఒ కాపీలను ప్రజాసంఘాల నాయకులు చింపివేసి నిరసన తెలిపారు. బాబాలు ప్రజల అమాయకత్వాన్ని, అజ్ఞానాన్ని ఆసరా చేసుకొని వేలకోట్లు, వందలాది ఎకరాల భూములు సంపాదిస్తున్నారని, అలాంటి వారిలో పుట్టపర్తి సాయిబాబా ఒకరని తెలిపారు.ఎన్‌టి రామారావు ఓంసచ్చితానంద, ఈసర్వం గోవిందా అంటూ తన సొంత సినిమా, కోడలు దిద్దిన కాపురంలో ఒక పాటాద్వారా పుట్టిపర్తిని ఉతికి ఆరేశాడన్నారు. అలాంటి పుట్టపర్తి సాయిబాబా శతజయంతిని ప్రభుత్వ పండగగా జరపాలని ప్రభుత్వం నిర్ణయించటం ఎన్‌టిఆర్‌ను అవమానించటమేనని అన్నారు. ఆయన ఆశ్రమంలో జరుగుతున్న అకృత్యాలకు సంబంధించి అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. హైటెక్ ముఖ్య మంత్రిగా పేరుతెచ్చుకున్న చంద్రబాబునాయుడు ఇలాంటి మోసాలు చేస్తే మీ ప్రతిష్ట తగ్గుతుందని సూచించారు. కావున తక్షణమే జిఒ ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హేతువాద సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మమతా చంద్రశేఖర్, విల్సన్, జె.రామారావు, సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.


సర్వేపల్లి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సెక్రటరీ, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

కెఎల్‌పి స్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి స్కూల్లో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. తొలుత పాఠశాల సెక్రెటరీ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, అకడమిక్ కోఆర్డినేటర్ బి.శైలజ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సెక్రెటరీ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల కలిగే మంచి, చెడును విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. పుస్తక పఠనాన్ని పెంపొందించాలని, ఉద్వేగాన్ని నియంత్రించుకునేలా వారిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఆర్‌విఆర్ బి.ఇడి కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.రవికుమార్ వినూత్న బోధన, తరగతి గది నిర్వహణపై ప్రసంగించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై విద్యను వారి నిత్యజీవితంలో సమన్వయంపరిచే విధంగా తోడ్పడాలని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి.రత్తయ్య మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థికి ఆదర్శంగా ఉంటూ వారి ప్రతిభను వెలికితీయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. విద్యార్థులు ఆలపించిన గేయాలు, నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి.

ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎఎన్‌యు


పోటీలు ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల రాష్ట్రస్థాయి నాలుగవ స్పోర్ట్స్ మీట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ గిరిజన మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలను రాణించడం ఆనందంగా ఉందన్నారు. రోజుకు గంట నుంచి రెండు గంటల పాటు శారీరక సామర్థ్యం పెంచుకునేందుకు క్రీడలో ఆడటం ఎంతో అవసరం అన్నారు. అధ్యయనం ఆటలు రెండు అవసరమే అన్నారు. గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ వాయిస్ చైర్మన్, ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం మల్లికార్జున నాయక్ మాట్లాడుతూ క్రీడలు పాఠ్యాంశంలోనే కాకుండా క్రీడా మైదానంలోనూ అవసరం ఉన్న ఆవశ్యకతను నొక్కి వక్కాణించారు. విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించే విధంగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ సదా భార్గవి గురుకులం సెక్రటరీ గౌతమి, వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పిపిఎస్ పాల్ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగుల గృహ సముదాయాలను పరిశీలించిన మంత్రి నారాయణ

ప్రజాశక్తి - తుళ్లూరు


ఇనుప నిచ్చెనపై మంత్రి నారాయణ, భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం నేలపాడులో నాలుగవ తరగతి, గెజిటెడ్ అధికారుల టైప్1,2 గహసముదాయాల నిర్మాణ పురోగతిని రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి ఎ.నారాయణ బుధవారం పరిశీలించారు. ఇనుప నిచ్చెన మీదుగా ఒక బిల్డింగ్ పైకి చేరుకొని స్లాబ్ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.నిర్మాణ సంస్థల ప్రతినిధులు,ఇంజినీర్లతో పనుల పురోగతి గురించి మాట్లాడారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అమరావతి నిర్మాణం లో 13 వేల మంది ఉద్యోగులు, కార్మికులు నిరంతరం పనిచేస్తున్నారని, ప్రొక్లయినర్‌లు, జెసిబి, ఇతర యంత్రాలు సుమారు 2,500 వరకు ఉన్నాయని చెప్పారు. గెజిటెడ్ అధికారుల టైప్1 భవనాల్లో 4 టవర్లలో 384 ప్లాట్లు, టైప్2 భవనాల్లో మరో 4 టవర్లలో 336 ప్లాట్లు నిర్మాణం జరుగుతుందన్నారు. గ్రూప్ డి ఉద్యోగులకు 6 టవర్లలో 720 ప్లాట్లు నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. మొత్తంగా 27 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 1440 ఇళ్ల నిర్మాణాలు దాదాపు తుది దశకు చేరుకున్నాయని, స్లాబ్ పనులు పూర్తి కాగా, మిగిలిన వాటి నిర్మాణాలు నవంబర్ చివరకు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు.అన్ని భవనాల నిర్మాణం మార్చి నెలాఖరులోగా పూర్తి చేసేలా ప్రణాళికా బద్ధంగా ముందుకెళుతున్నామని మంత్రి చెప్పారు. నిర్మాణాలు పూర్తయిన తర్వాతే అధికారులకు భవనాలు అంగజేస్తామన్నారు. రాజధానిపై కొందరు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, అమరావతి గ్రాఫిక్స్ అంటే ప్రజలు క్షమించరని అన్నారు. 360 కిలోమీటర్ల మేర ట్రంక్ రోడ్లు,1500 కిలోమీటర్లు అవుట్ రోడ్లు, 4,000 నివాస భవనాలు, ఐకానిక్ భవనాలు పనులు ఎంతో వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. అమరావతిలో వరద నివారణ కోసం నెదర్లాండ్ నిపుణులతో డిజైన్ చేయించామని, ఎలాంటి ముంపు లేకుండా కాలువలు రిజర్వాయర్లు నిర్మిస్తున్నామన్నారు. పనులు ఏమీ జరగడం లేదని పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్న వారు అమరావతి వచ్చి చూడాలన్నారు. అమరావతి చాలా సేఫ్ సిటీ.. అనుమానం లేదన్నారు.చెప్పిన మాట ప్రకారం మూడేళ్ళలో రాజధానిని నిర్మిస్తామన్నారు.